www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY


| యాదాద్రి భువనగిరి YADADRI BHUVANAGIRI | సంపుటి: 1 VOLUME : 1 | సంచిక: 275 ISSUE : 275 | సోమవారం, 2 మార్చి, 2026 MONDAY, MARCH 2, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు: 8 PAGES : 8 | వెల: 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## యూఏఈపై దాడులను ఖండిస్తున్నా: మోదీ



2 లో..

# ఇరాన్ కకావికలం



- రక్షణ, ఐఆర్‌జీసీ, ఎయిర్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్ కార్యాలయాల ధ్వంసం
- 9 ఇరాన్ యుద్ధనౌకలు, నేవీ హెడ్‌క్వార్టర్‌పై దాడి
- టెహ్రాన్ సహా ఇరాన్ నగరాలపై ఇజ్రాయెల్ బాంబులు
- రక్షణ మంత్రి, రెవల్యూషనరీ గార్డ్స్ చీఫ్ మృతి
- వందల సంఖ్యలో సైనికులు, భద్రతా సిబ్బంది కూడా..
- పాఠశాలపై క్షిపణి దాడిలో 165కు చేరిన మృతులు
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లోని 27 అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడిన ఇరాన్
- ఇజ్రాయెల్‌లో 9 మంది.. గల్ఫ్ దేశాల్లో ఆరుగురి మృతి
- ముగ్గురు అమెరికా సైనికులూ.. ఐదుగురు విషమం
- టెహ్రాన్, ఇతర నగరాల్లో ఖమేనీకి వేలాది మంది నివాళి
- 40 రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన ఇరాన్
- ఇంకా వేలాది లక్ష్యాలపై దాడులు చేస్తాం: నెతన్యాహు
- హోర్ముజ్ జలసంధిలో 3 చమురు నౌకలపై క్షిపణులు
- ఒక నౌకలో 15 మంది భారతీయులు.. క్షేమం



దుబాయ్/వాషింగ్టన్/టెల్అవీవ్, మార్చి 1:

ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడమే లక్ష్యమంటూ దాడులకు దిగిన అమెరికా, ఇజ్రాయెల్.. తొలిదాడినే అత్యంత కచ్చితత్వంతో పూర్తిచేశాయి. టెహ్రాన్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ ప్రధాన కార్యాలయంపై 30కిపైగా బాంబుల వర్షం కురిపించాయి. ఈ దాడిలో అయతుల్లా ఖమేనీ (86) మరణించారు. ఆయనతో పాటు ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ నసీర్ జాదే, ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్ మహమ్మద్ పాక్‌పోర్, ఖమేనీ ప్రధాన సలహాదారు అలీ షంఖనీ, మరో నలుగురు మిలటరీ ఉన్నతాధికారులు, ఖమేనీ కుమార్తె, అల్లుడు, కోడలు, మనవడు కూడా శనివారం ఉదయం జరిగిన తొలి దాడుల్లోనే మృతిచెందారు. కానీ ఆదివారం ఉదయం వరకు వివరాలు బయటికి రాలేదు. ఖమేనీ మృతిని నిర్ధారించుకున్న తర్వాత ఆదివారం ఉదయం అమెరికా మిగతా 2లో..

## నేడు అనంతగిరికి రాహుల్ గాంధీ



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి హాజరు
- పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం
- డీసీసీ అధ్యక్షులు, కుటుంబ సభ్యులతో ముఖాముఖి
- టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీతోనూ భేటీ

హైదరాబాద్, మార్చి 1 (వార్త వేదిక సూర్య):

ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సోమవారం వికారాబాద్ జిల్లాలోని అనంతగిరికి రానున్నారు. స్థానిక హరిత రిసార్ట్స్‌లో జరుగుతున్న తెలంగాణ, ఏపీ డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఎయిరిండియా విమానంలో ఉదయం 9.15 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న రాహుల్.. అక్కడి నుంచి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ప్రత్యేక హెలికాప్టర్‌లో అనంతగిరికి వెళతారు. అక్కడ తొలుత టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులతో కొద్దిసేపు ప్రత్యేకంగా సమావేశమవుతారు. అనంతరం డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారు. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై వారికి దిశానిర్దేశం చేస్తారు. దీంతోపాటు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన విషయాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులతో పాటు వారి కుటుంబ సభ్యులతో కూడా రాహుల్ ముఖాముఖి మాట్లాడనున్నట్లు, వారితో కలిసి ఫొటోలు దిగనున్నట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం ఉదయం 8 గంటలలోగా డీసీసీ అధ్యక్షులు తమ కుటుంబ సభ్యులను శిక్షణ శిబిరం వద్ద అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకుల నుంచి సమాచారం అందింది.

### రాజ్యసభ స్థానాలపై నిర్ణయం!

అనంతగిరిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పీసీసీల రాజకీయ మిగతా 2లో..

## వెలుగుమట్ల పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు

- 15వ తేదీలోగా మంజూరు చేస్తాం
- డబ్బు వసూలు చేసి భూదాన్ భూముల్లో ఇళ్లు ఇచ్చిన ముఠాను అరెస్టు చేస్తాం
- ఆ డబ్బును తిరిగి బాధితులకు ఇప్పిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం, మార్చి 1 (వార్త, వేదిక సూర్య):

ఖమ్మం సమీపంలోని వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన నిరుపేదలందరికీ ఈనెల 15వ తేదీలోగా నివాసయోగ్యంగా ఉన్న ప్రాంతాల్లో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. వెలుగుమట్లలో భూదాన్‌కు సంబంధించిన 31 ఎకరాల భూముల్లో నిరుపేదలతోపాటు కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, గతంలో ఇందిరమ్మ ఇళ్లు తీసుకున్న వారు పొరుగు జిల్లాల నుంచి కూడా వచ్చి ఉంటున్నారని మంత్రి తెలిపారు. వీళ్లలో కొందరు ఓ ముఠాకి రూ.30 వేల నుంచి రూ.8 లక్షల వరకు డబ్బు చెల్లించి షెడ్లు నిర్మించుకున్నారని చెప్పారు. ఆ ముఠాను అరెస్టు చేస్తామని అంతేకాక ముఠా వసూలు చేసిన డబ్బును రికవరీ చేసి బాధితులకు చెల్లిస్తామని మంత్రి స్పష్టం చేశారు. వెలుగుమట్ల బాధితులతో ఖమ్మం మిగతా 2లో..




## మేం చదువుకునేటప్పుడు బడిలో కులాల గురించి తెలియదు

2 లో..

- అన్ని కులాల వాళ్ళం ఒకే బడిలో చదువుకునేవాళ్ళం
- మళ్లీ ఇప్పుడు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో కులాలకు అతీతంగా అందరూ కలిసి చదువుకోవచ్చు
- దేశంలో ఏ రాష్ట్రంలో చేయలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ పథకాన్ని తీసుకొచ్చింది
- ఈ స్కూళ్లు పూర్తయిన తర్వాత దేశంలోని ప్రతి రాష్ట్రం తెలంగాణ వైపే చూస్తోంది
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మునుగోడు నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు
- మునుగోడులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూలు భూమి పూజలో రాజ్ గోపాల్‌రెడ్డి





## 17మంది సజీవ దహనం

- మైనింగ్-పారిశ్రామిక పేలుడు పదార్థాల ఫ్యాక్టరీలో విస్ఫోటం
- మహారాష్ట్రలో దుర్ఘటన

2 లో..

## పేదల ఇళ్ల కూల్చివేత క్రూరమైన చర్య

- ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పరామర్శ

ఖమ్మం, మార్చి 1 (వార్త వేదిక సూర్య):

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆదివారం ఆయన పరామర్శించి, ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు. అనంతరం రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మేలు చేయడానికే ప్రభుత్వం పేదల ఇళ్లు కూల్చివేసిందని ఆరోపించారు. వెలుగుమట్ల భూదాన్ భూములపై 'యథాతథ స్థితి' కొనసాగించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించినా, ప్రభుత్వం వాటిని ఖాతరు చేయకుండా, యంత్రాలతో ఇళ్లను కూల్చివేసిందని ధ్వజమెత్తారు. 15ఏళ్లుగా సుమారు 600 కుటుంబాలు ఇక్కడ నివాసం ఉంటున్నాయని, రెక్కాడితే గానీ డొక్కాడని ఆ పేదల పొట్ట కొట్టడం క్రూరమైన చర్య అని ధ్వజమెత్తారు. బాధితులందరికీ కూల్చిన చోటే పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



## సాహో.. సంజూ

### సెమీఫైనల్ టీమిండియా

### విండీస్ ఇంటికి.. ఇంగ్లండ్‌తో పోరుకు సై




**కోల్‌కతా:** టీ20 వరల్డ్‌కప్‌లో భారత జట్టు సెమీఫైనల్లోకి అడుగుపెట్టింది. ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో నెగ్గింది. ఓపెనర్ సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 97 నాటౌట్) చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో శతకం ముంగిట నిలిచాడు. ఇక ఈ విజయంతో గ్రూప్ 1లో రెండో స్థానంలో నిలిచిన భారత జట్టు సెమీస్‌లో ఇంగ్లండ్‌తో తలపడనుంది. గురువారం ఈ మ్యాచ్ జరగనుంది. అటు విండీస్ ఈ ఓటమితో ఇంటిముఖం పట్టగా.. 2016 సెమీస్‌లో కరీబియన్ల చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ముందుగా విండీస్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగులు చేసింది. ఛేజ్ (25 బంతుల్లో 5 ఫోర్లు, మిగతా 2లో..

# ఇరాన్ కకావికలం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. తర్వాత కాసేపటికి ఇరాన్ సుప్రీం లీడర్ అమరుడయ్యారని ఆ దేశ అధికారిక టీవీ చానల్ 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ (ఐఆర్ఐబీ)' వెల్లడించింది. ఖమేనీ తన కార్యాలయంలో ఉండగా జరిగిన దాడిలో మరణించారని, ఆయన నిరంతరం ప్రజల కోసం ముందు నిలిచి, తన బాధ్యతలను నిర్వర్తించారన్న విషయాన్ని ఈ ఘటన స్పష్టం చేస్తోందని పేర్కొంది. ఇక ఖమేనీ మృతి పట్ల ఇరాన్ 40రోజుల పాటు సంతాపదినాలను, ఏడు రోజుల పాటు పూర్తిస్థాయి సెలవులను ప్రకటించింది. ఇరాన్ ప్రజలు అత్యంత పవిత్రమైన దిగా భావించే ఖోమ్ నగరంలోని జమ్‌కారన్ మసీదుపై ఎర్రజెండా ఎగురవేశారు. ఖమేనీని చంపడంపై ఆయన మద్దతుదారుల్లో ఉన్న ఆగ్రహానికి, ప్రతీకారం తీర్చుకోవాలన్న కసికి ఇది నిదర్శనమని స్థాని కులు చెబుతున్నారు. మరోవైపు అమెరికా, ఇజ్రా యెల్ తమ రెడ్‌లైన్ దాటాయని, ఆ దేశాలు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఇరాన్ రివల్యూష నరీ గార్డ్స్ హెచ్చరించింది. ఈ క్రమంలో గల్ఫ్ దేశా ల్లోని అమెరికా స్థావరాలపై, ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. మరోవైపు ఇజ్రాయె ల్, అమెరికా కూడా ఇరాన్‌లోని టెహ్రాన్, ఇతర కీలక ప్రాంతాల్లో వైమానిక, క్షిపణి దాడులు కొనసాగిస్తున్నాయి.

### అటు నివాళి.. ఇటు సంబరాలు!

ఖమేనీ మృతి చెందారన్న విషయం తెలిసి టెహ్రాన్‌తోపాటు ఇరాన్‌లోని కీలక పట్టణాల్లో వేలాదిమంది ప్రజలు రోడ్లపైకి వచ్చారు. పలుచోట్ల ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడి ఖమేనీకి నివాళి అర్పిస్తున్న దృశ్యాలను ఇరాన్ అధికారిక టీవీ ప్రసారం చేసింది. టెహ్రాన్‌లోని ఎంఘెలాబ్ స్క్వేర్ ప్రాంతంలో వేలాది మంది నలుపు వస్త్రాలు ధరించి, ఇరాన్ జెండాలు ఊపుతూ ఖమేనీకి నివాళి అర్పించారు. మరోవైపు ఖమేనీ మృతితో టెహ్రాన్, ఇస్ఫహాన్, ఇతర నగరాల్లో కొన్నిచోట్ల జనం సంబరాలు చేసుకుంటున్నట్టుగా రాయిటర్స్, ఇతర వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఇక ఇరాన్‌పై దాడి, ఖమేనీ మృతి పట్ల ఇరాక్, పాకిస్థాన్‌తోపాటు పలు దేశాల్లో ఆందోళనలు జరిగాయి. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో అమెరికా రాయబార కార్యాలయంపై దాడికి నిరసనకారులు ప్రయత్నించారు. పాకిస్థాన్‌లోని కరాచీలో అమెరికా ఎంబసీకి ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఈ క్రమంలో భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో పది మంది మరణించారు.

### లింకన్ నౌకపై దాడి చేశాం.. అదేమీ లేదు..

యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక యుద్ధ నౌకపై నాలుగు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశామని, నౌక కొంతమేర ధ్వంసమైందని ఐఆర్‌జీసీ ఆదివారం ప్రకటించింది. అయితే అలాంటిదేమీ లేదని, ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు కనీసం నౌక దరిదాపుల్లోకి కూడా రాలేదని అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొంది. అంతేకాదు చబహార్ పోర్టులో ఇరాన్‌కు చెందిన జమరాన్ క్లాస్ యుద్ధ నౌకపై తమ దళాలు దాడి చేశాయని, అది సముద్రంలో మునిగిపోతోందని పేర్కొంది. కాగా, హోర్ముజ్ జల సంధి మీదుగా ప్రయాణిస్తున్న చమురు ట్యాంకర్ నౌకపై క్షిపణి దాడి జరిగింది. పలావ్ దేశ జెండాతో ప్రయాణిస్తున్న ఈ నౌకలో 15 మంది భారతీయులు సహా 20 మంది సిబ్బంది ఉన్నారని, అందులో నలుగురికి గాయాలయ్యాయని ఒమన్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. హోర్ముజ్ జలసంధిని మూసేస్తున్నట్టు ఐఆర్‌జీసీ నుంచి అనధికారికంగా హెచ్చరికలు జారీ అయిన నేపథ్యంలో.. చమురు నౌకలపై దాడులు జరగడం గమనార్హం. దీనితో వందల కొద్దీ చమురు రవాణా నౌకలు హోర్ముజ్ జల సంధికి ఇరువైపులా నిలిచిపోయాయి.

### శత్రువులకు నరకానికి గేట్లు తెరుస్తాం: ఇరాన్

ఖమేనీ మరణానికి కారకులైన వారికి అత్యంత తీవ్రమైన శిక్ష తప్పదని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ), ఇరాన్ కేబినెట్ తీవ్రంగా హెచ్చరించాయి. తమ చరిత్రలో ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో అమెరికా స్థావరాలపై, ఇజ్రాయెల్‌పై ఆపరేషన్ చేపడతామని ఐఆర్‌జీసీ ప్రకటించింది. తమ ప్రతీకారం తీవ్రంగా ఉంటుందని పేర్కొంది. శత్రువుల కోసం నరకలోకం గేట్లు తెరిచే ఉంచుతామని వ్యాఖ్యానించింది.ఖమేనీ మృతి నేపథ్యంలో తాత్కాలిక పాలనా మండలిని ఏర్పాటు చేశామని.. శత్రుదేశాల దాడులను దీటుగా ఎదుర్కొని, వారి స్థావరాలను నాశనం చేస్తామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు.





### అరబ్ దేశాల్లో ముస్లింలపై తీవ్ర ప్రభావం

రంజాన్ మాసంలో ప్రపంచంలో ఏ మూలన ఉన్న ముస్లింలు అయినా ఎంతో భక్తిశ్రద్ధలతో గడుపుతారు. సాధారణంగా రోజుకు ఐదుసార్లు నమాజు చేసే ముస్లింలు.. రంజాన్ మాసంలో అంతకంటే ఎక్కువసార్లు చేస్తూ దైవ చింతనలో ప్రశాంతంగా గడుపుతుంటారు. ఇలాంటి సమయంలో యుద్ధం మొదలుకావటంతో అరబ్ దేశాల్లోని ముస్లింలలో అసహనం పెరిగిపోతోంది. నమాజు చేయటానికి కూడా ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎప్పుడు బాంబులు వచ్చిపడతాయో తెలియని పరిస్థితుల్లో ప్రభుత్వాలు ముందు జాగ్రత్తగా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు పలు ఆంక్షలు విధించాయి. ముఖ్యంగా పెద్ద నగరాల్లో ఉండేవారిపై ఆంక్షలు అధికంగా ఉన్నాయి. దీంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి.

### పరస్పరం భీకర దాడులు..

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తోపాటు ఇస్ఫహాన్, ఇతర కీలక నగరాల్లోని మిలటరీ స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాలపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం టెహ్రాన్‌లోని పోలీసు ప్రధాన కార్యాలయం సమీపంలో అతిభారీ పేలుడు జరిగింది. మెహ్రాన్ నగరంలో జరిగిన క్షిపణి దాడిలో 43 మంది ఇరాన్ భద్రతా సిబ్బంది మరణించారు. ఇరాన్‌లోని బాలికల పాఠశాలపై జరిగిన క్షిపణి దాడిలో మృతుల సంఖ్య 165కు పెరిగింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై, గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ నిరంతరంగా క్షిపణుల దాడి కొనసాగిస్తూనే ఉంది. మరోవైపు దుబాయ్, ఖతార్, బహ్రెయిన్, సౌదీ, ఇరాక్, కువైట్ తదితర దేశాల్లోని 27 అమెరికా సైనిక స్థావరాలపై 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్' పేరిట దాడులు చేపట్టినట్టు ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. కువైట్‌లోని అమెరికా నౌకాదళ బేస్‌పై నాలుగు క్షిపణులు, 12 డ్రోన్లతో దాడి చేసి ధ్వంసం చేశామని.. పెద్ద సంఖ్యలో అమెరికా సైనికులు మరణించారని తెలిపింది. ఇక ఇరాన్ అధికారిక టీవీ ఐఆర్ఐబీ ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ క్షిపణి దాడులు చేసింది. అయితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రసారాలు కొనసాగిస్తున్నట్టు ఐఆర్ఐబీ ప్రకటించింది. కాగా, ఇరాన్ దాడులతో ఇజ్రాయెల్‌లో 9 మంది మృతిచెందగా, 121 మంది గాయపడినట్టు ఆ దేశ ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ఇక ఇరాక్‌లో ఇద్దరు, కువైట్‌లో ఒకరు, యూఏఈలో ముగ్గురు మృతిచెందారు. ఇక ముగ్గురు అమెరికన్ సైనికులు మరణించారని, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇరాన్‌లోని కీలక క్షిపణి స్థావరాలపై బీ–2 స్టెల్త్ బాంబర్లతో దాడులు చేశామని, ఒక్కోటి 907 కిలోల బరువైన భారీ బాంబులతో విధ్వంసం సృష్టించామని వెల్లడించింది.







### ఇంకా వేలాది లక్ష్యాలపై దాడులు కొనసాగుతాయి: నెతన్యాహు

ఇరాన్ ఉన్నతాధికారుల్లో చాలా మంది చనిపోయారని, ఈ దాడులు మరికొన్ని రోజులపాటు కొనసాగుతాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. ఇంకా వేలాది లక్ష్యాలపై దాడులు చేయనున్నట్టు తెలిపారు. ఇరాన్‌కు చెందిన ధైర్యవంతులైన ప్రజలు తమ సంకెళ్లను తెంచుకుని, స్వేచ్ఛను పొందేందుకు అనువైన పరిస్థితిని తాము సృష్టిస్తున్నామని.. అంతా బయటికి వచ్చి ప్రభుత్వాన్ని కూలదోసి స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాగా ఇజ్రాయెల్ తమ సైన్యాన్ని పూర్తిస్థాయి యుద్ధానికి సన్నద్ధం చేస్తోంది. లక్ష మంది రిజర్వు బలగాల సిబ్బందిని వెంటనే విధుల్లోకి రావాల్సిందిగా ఆదివారం ఆదేశాలు జారీ చేసింది.

# నేడు అనంతగిరికి రాహుల్

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారాల కమిటీల (పీఏసీ)లతో రాహుల్‌గాంధీ వేర్వేరుగా సమావేశం కానున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంద ని తెలుస్తోంది. అయితే పీఏసీతో భేటీలో ఈ అంశంపై చర్చ ఉండదని, అది కేవలం ఫొటో సెషన్‌గా మాత్రమే ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, సాయంత్రం 4.30 గంటలకు రాహుల్ అక్కడి నుంచి బయలుదేరి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు తిరిగి ఢిల్లీకి వెళతారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌గాంధీ వికారాబాద్ జిల్లా పర్యటన నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నేతలంతా అనంతగిరి బాట పట్టారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం మధ్యాహ్నమే అనంతగిరి చేరుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీడబ్ల్యుసీ సభ్యుడు వంశీచంద్ రెడ్డి, సంఘటన్ సృజన్ అభియాన్ చైర్మన్ సచిన్‌రావు తదితరులు హరిత రిసార్ట్స్‌లో రాహుల్ పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాహుల్‌తోపాటు సీఎం రేవంత్ కూడా వస్తుండడంతో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

### నాగార్జున సాగర్‌కు ఖర్గే..

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం నాగార్జునసాగర్‌లోని బుద్ధ పూర్ణిమను సందర్శించనున్నారు. అక్కడ బౌద్ధ భిక్షువులకు సంబంధించి జరిగే ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొంటున్నారు. ఉదయం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్న ఖర్గే.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సాగర్‌కు వెళతారు.

# 17 మంది సజీవ దహనం

### మైనింగ్-పారిశ్రామిక పేలుడు పదార్థాల ఫ్యాక్టరీలో విస్ఫోటం

### మహారాష్ట్రలో దుర్ఘటన

**నాగ్‌పూర్, మార్చి 1:** మైనింగ్–పారిశ్రామిక పేలుడు పదార్థాలు తయారు చేసే ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి 17 మంది సజీవ దహనమయ్యారు. గుర్తుపట్టడానికి వీలులేని విధంగా మృతదేహాలు కాలిపోవడంతో మృతుల గుర్తింపు కోసం కుటుంబసభ్యుల నుంచి డీఎన్ఏ శాంపిళ్లను అధికారులు సేకరిస్తున్నారు. ఘటనలో మరో 18 మందికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా కాటో ల్ మండలం రావుల్‌గావ్ గ్రామంలో ఉన్న ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌లో ఆదివా రం ఉదయం ఈ పేలుడు సంభవించింది. ఘటన స్థలంలో ఎన్‌డీఆర్ఎఫ్, అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్), ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ సెక్యూరిటీ) బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు నిర్వహిస్తున్నాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి, వైద్యం అందిస్తున్నామన్నారు. స్థానిక అధికారుల నుంచి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నామని వెల్లడించారు. కాగా, కంపెనీకి చెందిన ప్యాకింగ్ యూనిట్‌లో ఉదయం 7 గంటల నుంచి 7.15 గంటల మధ్యలో ఈ పేలుడు సంభవించిందని ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. 'ఆ సమయంలో పేలు డు పదార్థాల తయారీ ప్రక్రియలేమీ జరగడం లేదు. పేలుడుకు కారణం ఏమిటనేదానిపై దర్యాప్తు కొనసాగుతోంది. సంబంధిత అధికారులకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నాం' అని పేర్కొంది. తక్షణమే అత్యవసర స్పందన ప్రొటోకాల్స్‌ను అమలు చేశామని, పరిస్థితి నియంత్రణలోకి వచ్చిందని తెలిపింది. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది.

# యూఏఈపై దాడులను ఖండిస్తున్నా: మోదీ

**న్యూఢిల్లీ:** ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడుల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించారు. యూఏఈపై జరిగిన దాడులను ఆయన ఖండించారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్‌తో తాను ఫోన్ ద్వారా మాట్లాడానంటూ మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దాడుల్లో ప్రాణ నష్టంపై ఆయన సంతాపం తెలిపారు. కష్ట సమయంలో యూఏఈ వెన్నంటే భారత్ ఉంటుందన్నారు. యూఏఈలో ఉంటోన్న భారతీయులకు సంబంధించి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నందుకు నహ్యాన్‌కు ధన్యవాదాలు తెలిపానన్నారు. ఉద్రిక్తతలు తగ్గడానికి, ప్రాంతీయ శాంతి, భద్రత, సుస్థిరతకు మద్దతిస్తామంటూ ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడుల తర్వాత ఇరాన్ యూఏఈతో పాటు పలు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతిదాడులు చేసింది. ఈ తరుణంలో మోదీ తాజా పోస్ట్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. మరోవైపు ఢిల్లీలోని ప్రధాని నివాసంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ సమావేశం జరిగింది. మూడు గంటలకు పైగా సాగిన సమావేశంలో అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్, నిర్మల, జాతీయ భద్రతా సలహాదారు దొబాల్ తదితరులు హాజరయ్యారు.

# వెలుగుమట్ల పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టరేట్‌లో ఆదివారం సమావేశమైన మంత్రి పొంగులేటి ఈ మేరకు మాట్లాడారు. బాధితులందరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి పొంగులేటి విలేకరులతో మాట్లాడుతూ.. భూదాన్ భూముల్లో ఇళ్లు కోల్పోయిన 720 కుటుంబాలను గుర్తించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, వెలుగుమట్లలో నష్టపోయిన స్థానిక పేదలందరికీ ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ముగ్గుపోసి నిర్మిస్తామన్నారు. 15 రోజుల్లో ఈ కార్యక్రమం మొదలవుతుందని తెలిపారు. వీరందరికీ విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలతోపాటు, అంగన్‌వాడీ సెంటర్, ప్రభుత్వ స్కూలు ఏర్పాటు చేస్తామని వారు గౌరవంగా జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రేవంత్ కూడా జిల్లాకు చెందిన మంత్రులతోపాటు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారని చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు న్యాయం చేయలేదని, ఇళ్లు కూల్చి నష్టం చేసిందన్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనా తప్పుడు ప్రచారాలు చేస్తున్న కొన్ని పత్రికలు, ఛానెల్లు నిజాలు తెలుసుకోవాలని హితవు పలికారు. వెలుగుమట్లతో పాటు కొన్నిచోట్ల జరుగుతున్న సంఘటనలపై తమ రాజకీయ స్వలా భం కోసం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. పార్టీకి ఫండ్‌గా రూ.100కోట్లు పంపించేందుకు భూమిని ఖాళీ చేయించినట్టు కొందరు మాట్లాడుతున్నారని.. ఇలా మాట్లాడే వారి చరిత్ర ఏంటో ప్రజల ఎదుట బయట పెడతామని తెలిపారు.

# మేం చదువుకునేటప్పుడు కులాల గురించి తెలియదు

**చౌటుప్పల్, మార్చి 1 (వార్తా వేదిక సూర్య):**

నల్లగొండ జిల్లాలోని మునుగోడులో ని దుబ్బ కాలువ రోడ్డులో 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, టీ జీ ఈ డబ్ల్యు ఐ డి సి ఎండి గణపతి రెడ్డి తో కలిసి ఆదివారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో 2500 మంది విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణం చేసుకోవడం శుభపరిణామం అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో 79 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ప్రారంభమవుతున్నాయి. వీటిలో సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు చదువుకోబోతున్నారు. మేము చిన్ననాటి చదువుకునేటప్పుడు కులాల గురించి తెలియదని, అన్ని కులాల అన్ని మతాలవారు ఒకే ప్రాంగణంలో చదువుకునేవాళ్లం.. ఇప్పుడు ఇవి కూడా అలాంటి పాఠశాలే ఈ పాఠశాలలో అన్ని కులాల వారు అన్ని మతాలవారు కలిసిమెలిసి చదువుకోవచ్చు. గత ప్రభుత్వం విద్యను గాలికి వదిలేసింది. కొందరికి బర్లిచ్చారు కొందరికి గొర్లిచ్చారు కొందరికి చేప పిల్లలు ఇచ్చారాణి ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించలేదన్నారు. విద్య వైద్యాన్ని గత ప్రభుత్వం గాలికి వదిలేసింది.



### కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ

దేశంలో ఏ రాష్ట్రంలో చేయలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ పథకాన్ని తీసుకువచ్చింది అన్నారు. ఈ స్కూళ్లు పూర్తయిన తర్వాత దేశంలోని ప్రతి రాష్ట్రం తెలంగాణ వైపే చూస్తోంది. రాబోయే రెండు సంవత్సరాలలో ఈ స్కూలు నిర్మాణం పూర్తి అవుతుంది. గత ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసింది అవి సీమాంధ్ర కాంట్రాక్టర్లకు లాభం అయింది అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 76 లక్షల ముప్పై ఐదువేల 115 మంది విద్యార్థిని విద్యార్థులు తెలంగాణ రాష్ట్రంలో చదువుతున్నారు ప్రైవేట్ సెక్టార్ లో 44 లక్షల మంది విద్యార్థులు చదివితే ప్రభుత్వ సెక్టార్లో 24 లక్షల మంది చదువుతున్నారు. విద్య మొత్తం కార్పొరేట్ చేతిలోకి వెళ్ళిపోయింది. కనీసం 50 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ ఇన్స్టిట్యూషన్స్లో చదివే అవకాశం రావాలి. బడ్జెట్లో 10 నుండి 15% బడ్జెట్ కేటాయిస్తే సాధ్యమవుతుంది. బడ్జెట్లో విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలి. మునుగోడు నియోజకవర్గంలో 330 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.. వీటిలో చదివే విద్యార్థుల సంఖ్య 9, 700 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మునుగోడులో విద్యావ్యవస్థలో సమూల మైన మార్పులు తీసుకురావాల్సి ఉందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మెస్ చార్జీలను పెంచాం. విద్య విషయంలో రాబోయే రోజుల్లో చాలా చేయాల్సి ఉందన్నారు. హైదరాబాదుకు కూతవేటు దూరంలో ఉన్న మునుగోడు నియోజకవర్గంలో అభివృద్ధి లేదు. నల్గొండ జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం మునుగోడు నియోజకవర్గం. ఈ నియోజకవర్గానికి ఎంతో చేయాల్సి ఉందని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. మొట్టమొదటి అడుగు ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం అని ఆయన పేర్కొన్నారు.

### నల్గొండ జిల్లా అంటే రాష్ట్ర రాజకీయాల్లో టైగర్ జోన్

నల్లగొండ జిల్లా రాష్ట్ర రాజకీయాలను శాసించే జిల్లా.. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మునుగోడు నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాల తెలుపుతున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ స్కూలు ప్రారంభ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి గారికి శుభాభినందనలు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజ్ గోపాల్ రెడ్డి తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించే ప్రయత్నం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో విద్యకు తక్కువ బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులు ఉన్నాయి. విద్యా వైద్యంపై ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి. విద్యా వైద్యాన్ని కార్పొరేట్ శక్తులు వ్యాపారంగా మార్చాయి. ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత ఉన్నది. నియోజకవర్గ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల రావడం శుభ పరిణామం సత్యం తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులు కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సాహో.. సంజూ

(మొదటి పేజీ తరువాయి)

1 సిక్స్‌తో 40), హోల్డర్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 నాటౌట్), పోవెల్ (19 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 34 నాటౌట్), హోప్ (33 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 32), హెట్‌మయెర్ (12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 27) రాణించారు. బుమ్రాకు 2 వికెట్లు లభించాయి. ఛేదనలో భారత్ 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 199 పరుగులు చేసి గెలిచింది. తిలక్ (27) ఫర్వాలేదనిపించాడు. హోల్డర్, జోస్‌ఫలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సంజూ శాంసన్ నిలిచాడు.

### సంజూ అంతా తానై:..

ఛేదనలో ఓపెనర్ శాంసన్ ఆరంభం నుంచి ముగింపు వరకు అంతా తానై కదం తొక్కాడు. మరో ఎండ్‌లో పెద్దగా సహకారం లభించకపోయినా ఎలాంటి తడబాటుకు లోనుకాకుండా జట్టును సెమీస్‌కు చేర్చాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా నిలకడను ప్రదర్శిస్తూ చెలరేగాడు. ఇక జింబాబ్వేపై హాఫ్ సెంచరీతో ఫామ్ చాటుకున్న అభిషేక్ (10) మళ్లీ నిరాశపరిచాడు. ఇషాన్ (10) ఆట ఆరు బంతులకే పరిమితమైంది. వాస్తవానికి తొలి 10 బంతుల వరకు శాంసన్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కానీ మూడో ఓవర్‌లో మాత్రం 4,6,4తో తన ఉద్దేశాన్ని చాటుకున్నాడు. తన జోరుతో పవర్‌ప్లేలో స్కోరు 53/2తో మెరుగ్గా కనిపించింది. సూర్య (18) ఆచితూచి ఆడినా మరోవైపు శాంసన్ మాత్రం ధాటిని కొనసాగించాడు. షెఫర్డ్ ఓవర్‌లో 6,4తో ఆకటుకున్నాడు. అటు ఓసారి క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్న సూర్యను 11వ ఓవర్‌లో జోసెఫ్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో మూడో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఇన్నింగ్స్ కాస్త నెమ్మదించింది. అయితే 13వ ఓవర్‌లో తిలక్ హ్యాట్రిక్ ఫోర్లతో 17 రన్స్ సమకూరాయి. హెట్‌మయెర్ సూపర్ క్యాచ్‌తో తను పెవిలియన్‌కు చేరినా నాలుగో వికెట్‌కు 26 బంతుల్లోనే 42 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత హార్దిక్ (17), దూబే (8 నాటౌట్) సహకరించారు. మరోవైపు శాంసన్ శతకం పూర్తి చేయకపోయినా 6,4తో మ్యాచ్‌కు అద్భుత ముగింపునిచ్చాడు.

### హోల్డర్-పోవెల్ ఎదురుదాడి

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్ ఆరంభం ఓ మాదిరిగా సాగగా, మధ్య ఓవర్లలోనూ పెద్దగా మెరుపులు కనిపించలేదు. కానీ చివరి ఐదు ఓవర్లలో హోల్డర్, పోవెల్ బ్యాట్లకు పనిచెప్పారు. దీంతో విండీస్ స్కోరు 200 దరిదాపుల్లోకి రాగలిగింది. తొలి వికెట్‌కు ఓపెనర్లు హోప్, చేజ్ 68 పరుగులు జోడించినా.. బంతికో పరుగు చొప్పున అన్నట్టుగా వీరి ఆట సాగింది. ముఖ్యంగా షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడిన హోప్ 17 డాట్ బాల్స్ ఆడాడు. మరోవైపు చేజ్ మూడో ఓవర్‌లో రనౌట్, ఐదో ఓవర్‌లో క్యాచ్ అవుట్ నుంచి బతికిపోయాడు. పవర్‌ప్లేలో 45 పరుగులతో నిలిచిన విండీస్ తొమ్మిదో ఓవర్‌లో తొలి వికెట్‌ను కోల్పోయింది. హోప్‌ను వరుణ్ బౌల్డ్ చేయడంతో ఈడెన్‌లో హుషారు కనిపించింది. ఆ తర్వాత హెట్‌మయెర్ ఉన్నది కాసేపైనా ధనాధన్ ఆట ఆడాడు. వరుణ్ ఓవర్‌లో 6,4తో 17 రన్స్ రాబట్టాడు. అయితే 12వ ఓవర్‌లో పేసర్ బుమ్రా డబుల్ ఝలక్ ఇచ్చాడు. జోరు మీదున్న హెట్‌మయెర్‌తో పాటు క్రీజులో నిలదొక్కుకున్న చేజ్‌ను సైతం పెవిలియన్‌కు చేర్చాడు. కాసేపటికే రూథర్‌ఫోర్డ్ (14)ను హార్దిక్ దెబ్బతీయడంతో విండీస్‌కు 150 కూడా కష్టమేనేమో అనిపించింది. ఈ స్థితిలో ఆల్‌రౌండర్ జాసన్ హోల్డర్ అండగా నిలవగా, అతడికి పోవెల్ సహకరించాడు. 16వ ఓవర్‌లో పోవెల్ 6,6,4 బాదగా మొత్తం 24 రన్స్ సమకూరాయి. ఆ తర్వాత హోల్డర్ 6,4తో 14 రన్స్ రాగా, స్కోరు 150 దాటింది. కానీ 19వ ఓవర్‌లో అర్ష్‌దీప్ 6 పరుగులే ఇచ్చి కట్టడి చేశాడు. దీంతో ఆఖరి ఓవర్‌లో 14 రన్స్ వచ్చినా స్కోరు 200 లోపే ముగిసింది. ఐదో వికెట్‌కు హోల్డర్–పోవెల్ జోడీ అజేయంగా 76 రన్స్ జత చేసింది.

వెస్టిండీస్: హోప్ (బి) వరుణ్ 32, చేజ్ (సి) సూర్య (బి) బుమ్రా 40, హెట్‌మయెర్ (సి) శాంసన్ (బి) బుమ్రా 27, రూథర్‌ఫోర్డ్ (సి) శాంసన్ (బి) హార్దిక్ 14, పోవెల్ (నాటౌట్) 34, హోల్డర్ (నాటౌట్) 37; ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 195/4; వికెట్ల పతనం: 1–68, 2–102, 3–103, 4–119; బౌలింగ్: అర్ష్‌దీప్ 4–0–43–0, హార్దిక్ 4–0–40–1, అక్షర్ 4–0–35–0, బుమ్రా 4–0–36–2, వరుణ్ 4–0–40–1.

**భారత్:** అభిషేక్ (సి) హెట్‌మయెర్ (బి) హొసీన్ 10, శాంసన్ (నాటౌట్) 97, ఇషాన్ (సి) హెట్‌మయెర్ (బి) హోల్డర్ 10, సూర్య (సి) రూఽథర్‌ఫోర్డ్ (బి) జోసెఫ్ 18; తిలక్ (సి) హెట్‌మయెర్ (బి) హోల్డర్ 27, హార్దిక్ (సి) హోల్డర్ (బి) జోసెఫ్ 17, దూబే (నాటౌట్) 8, ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 19.2 ఓవర్లలో 199/5. వికెట్ల పతనం: 1–29, 2–41, 3–99, 4–141, 5–179. బౌలింగ్: హొసీన్ 2–0–22–1, ఫోర్డ్ 3–0–22–0, హోల్డర్ 4–0–38–2, మోటీ 2–0–18–0, షెఫర్డ్ 2.2–0–34–0, జోసెఫ్ 4–0–42–2, చేజ్ 2–0–18–0.





# అద్దె భవనాల నుంచి సర్కారీ కొలువులకు విముక్తి!

- రాజేంద్రనగర్, నార్సింగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల మార్పు
- నూతన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**మైలర్ దేవ్ పల్లి, మర్చి 01 ( వార్త వేదిక సూర్య ) :** ప్రభుత్వ కార్యాలయాలన్నీ సొంత భవనాల్లోనే నిర్వహించాలన్న లక్ష్యంతో అద్దె భవనాల్లో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ప్రభుత్వ ప్రాంగణాల్లోకి మారుస్తున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన రాజేంద్రనగర్ మరియు నార్సింగి-గండిపేట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నూతనంగా కేటాయించిన ప్రభుత్వ భవనాల్లో రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. గత కొంతకాలంగా ప్రైవేట్ అద్దె భవనాల్లో కొనసాగుతున్న రాజేంద్రనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఇకపై స్థానిక మహిళా సమైక్య భవనం నుండి సేవలు అందించనుంది. అలాగే, నార్సింగి-గండిపేట్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని హిమాయత్ సాగర్ (బండ్లగూడ జాగీర్) లోని పాత మున్సిపల్ కార్పొరేషన్ భవనంలోకి తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "ప్రైవేట్ భవనాల్లో ఇరుకుగా ఉ ఒడటం వల్ల రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు విశాలమైన ప్రభుత్వ భవనాల్లోకి మార్చడం వల్ల పార్కింగ్, వెయిటింగ్ హాల్స్ వంటి మెరుగైన వసతులు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై అద్దె భారం తగ్గడమే కాకుండా, పనుల్లో పారదర్శకత, వేగం పెరుగుతుంది" అని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాంగణాల్లోనే పరిపాలన సాగించడం వల్ల అధికారుల్లో జవాబుదారీతనం పెరుగుతుందని, ప్రజలకు సేవలు మరింత చేరువవుతాయని ఆయన ధీమా



వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ఇతర శాఖల కార్యాలయాలను కూడా దశలవారీగా సొంత భవనాల్లోకి మారుస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల వీరేశం



**నల్లగొండ బ్యూరో, మార్చి 1 (వార్తా వేదిక సూర్య )** నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో యశోద హాస్పిటల్స్ హైదరాబాద్ వారి సౌజన్యంతో, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అత్యంత అవసరమని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.



## మేడ్చల్ జిల్లా పెరిక పురగిరి క్షత్రియ కుల సంఘం సర్వసభ్య సమావేశం

**సికింద్రాబాద్, మార్చి 01(వార్త వేదిక సూర్య)** మెరిడియన్ స్కూల్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం మేడ్చల్ జిల్లా పెరిక(పురగిరి క్షత్రియ) కుల సంఘం జిల్లా అధ్యక్షులు సోమసాని రమేష్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గటిక విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి దొంగరి మనోహర్, అసోసియేట్ అధ్యక్షులు సుంకరి ఆనంద్, ఆర్థిక కార్యదర్శి లింగం, మాజీ అధ్యక్షులు దాసరి మల్లేశం, మాజీ అధ్యక్షులు శ్రీరాం దయానంద్ విశిష్ట అతిథులు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు డాక్టర్ బొలిశెట్టి సతీష్ వర్మ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు దాసరి జయప్రకాష్, యువజన విభాగం గౌరవ సలహాదారులు మాడిశెట్టి శ్రీధర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు(=ఎ), యాదాద్రి జిల్లా అధ్యక్షులు పరమేష్,మల్కాజిగిరి నియోజకవర్గ జిల్లా అధ్యక్షులు దిడ్డి రాజు ఎల్బీనగర్ అసోసియేట్ అధ్యక్షులు దాచేపల్లి రవి రంగారెడ్డి జిల్లా ప్రచార కార్యదర్శి మేకల మహేష్ అనేక మంది కుల సంఘ నేతలు పాల్గొన్నారు .తదనంతరం ఎన్నికల కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా చింతం రాజేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర కమిటీ మరియు వివిధ జిల్లాల నాయకులు మరియు పలువురు సంఘ నేతలు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

- వందలాది మందికి కంటి పరీక్షలు, అద్దాల పంపిణీ
- నీరుడు శేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో 'యోగక్షేమం వహామ్యహం' ట్రస్ట్ డ 'సాదూరం' ఆసుపత్రి సేవా కార్యక్రమం
- ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి



**మైలర్ దేవ్ పల్లి, మర్చి 01 (వార్త వేదిక సూర్య ) :** పేదలకు నాణ్యమైన కంటి వైద్యం అందించాలనే లక్ష్యంతో కిస్మత్‌పూర్ 122వ డివిజన్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం ఘనంగా జరిగింది. కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నీరుడు శేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, యోగక్షేమం వహామ్యహం చారిటబుల్ ట్రస్ట్ మరియు సాదూరం కంటి ఆసుపత్రి సంయుక్త సారథ్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. బండ్లగూడ కాళీ మందిర్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరిగిన ఈ శిబిరానికి స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచే వందలాది మంది ప్రజలు హాజరై తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరై శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నీరుడు శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ...ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యతతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 356 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 200 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశామని వివరించారు. కంటి శుక్లాల (కాటరాక్ట్) సమస్య ఉన్నట్లు గుర్తించిన 30 మందికి సోమవారం (మార్చి 2) ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేస్తామని చెప్పారు. మరో 10 మందిని మెరుగైన చికిత్స కోసం సాదూరం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కంటి సమస్యలతో పాటు జనరల్ వైద్య బృందం ద్వారా ఇతర ఆరోగ్య సమస్యలపై కూడా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మహాలింగం, భీమార్జున్ రెడ్డి, మాజీ పాక్స్ చైర్మన్ రాందాసు ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు మహేష్ యాదవ్, నరేష్ యాదవ్, పవన్ సాయి, ప్రవీణ్ గౌడ్, అభినయ్ గౌడ్, టి. నర్సింగ్ రావు గౌడ్, టి. గోపి గౌడ్, వై. సాయి కుమార్ యాదవ్, నిరుడు కిరణ్, గణేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సహకరించిన వైద్య బృందానికి, పాఠశాల సిబ్బందికి శేఖర్ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.




## గుండాలలో దారుణం భర్తను సుత్తితో హత్య చేసిన భార్య



**గుండాల, వార్తవేదిక సూర్య మార్చి 01 :** గుండాల ప్రతినిధి సమాచారం ప్రకారం, గుండాల మండల కేంద్రంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. యాదవ సామాజిక వర్గానికి చెందిన మాదరబోయిన భిక్షం అర్ధరాత్రి సమయంలో గాఢ నిద్రలో ఉండగా, భార్య అతనిపై సుత్తితో దాడి చేసి హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.అర్ధరాత్రి 12 గంటల సమయంలో భిక్షం నిద్రలో ఉన్నప్పుడు భార్య బలమైన సుత్తితో తలపై తీవ్రంగా మోది చంపినట్లు సమాచారం. గతంలో కూడా ఒకసారి గొడ్డలితో దాడి చేసిన ఘటన ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కుటుంబంలో తరచూ కలహాలు జరుగుతుండేవని, భర్త భార్యల మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఘటన విషయం తెలుసుకున్న వెంటనే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ గౌడ్, ఎస్సై తేజం రెడ్డి, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి స్థాయి విచారణ చేపట్టారు. హత్యకు గల అసలు కారణాలు ఏమిటన్నది దర్యాప్తులో వెల్లడికానుంది. స్థానిక ప్రజలు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కుటుంబ విభేదాలను సమయానుకూలంగా పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు. కుటుంబ సమస్యలు తీవ్రరూపం దాల్చే ముందు పెద్దల మధ్య చర్చలు, కౌన్సెలింగ్ ద్వారా పరిష్కారం కనుగొనడం అవసరమని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

## జిల్లాలో విస్తృత డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**మద్యం సేవించి పట్టుబడ్డ 11 మందిపై**

**కేసులు నమోదు**

**మద్యం తాగి వాహనాలు నడిపితే**

**కఠిన చర్యలు తప్పవు**

**మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు**



**నల్లగొండ బ్యూరో, మార్చి 1 (వార్తా వేదిక సూర్య )** నల్లగొండ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలో విస్తృత డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడ్డాయి. మాడుగులపల్లి టోల్ ప్లాజా వద్ద మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గత 24 గంటలుగా ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. మిర్యాలగూడ రూరల్ సీఐతో పాటు నలుగురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది సమన్వయంతో భారీ వాహనాలు అయిన లారీలు, కంటైనర్లు, ట్రక్కులను లక్ష్యంగా చేసుకుని డ్రైవర్లకు బ్రెతలైజర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 3,150 మంది డ్రైవర్లను తనిఖీ చేయగా, వారిలో 11 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి, వారి వాహనాలను సీజ్ చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా డిఎస్పీ రాజశేఖర్ రాజు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం కోసం జిల్లాలో నిరంతరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. భారీ వాహనాల డ్రైవర్లు దీర్ఘకాల ప్రయాణాలు చేసే సమయంలో మద్యం సేవించడం ప్రమాదాలకు దారితీస్తుందని, ఇది చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో రోడ్డు భద్రత పట్ల పోలీసులు కట్టుబడి ఉన్నారని, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



## న్యాయవాదపరిషత్ నల్గొండ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం

**నల్గొండ బ్యూరో టౌన్ (వార్త వేదిక సూర్య). మార్చ్ 1** ఆదివారం నల్గొండ నగరంలో లోని "షాలిని" రెసిడెన్సీ లో న్యాయవాదపరిషత్ నల్గొండ జిల్లా అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా జాతీయ అధ్యక్షులు ఎ శ్రీనివాస మూర్తి హాజరయ్యారు. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున న్యాయవాదులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి పలువురు వక్తలు ప్రసంగించారు. న్యాయవాదులు తమ విధులను కోర్టులో మరియు సమాజంలో బాధ్యతాయుతంగా నిర్వంచాలని, యువ న్యాయవాదులు నిరంతరం కేసులను చదువుతూ..సీనియర్ న్యాయవాదుల సలహాలు సూచనలతో ముందుకు సాగాలని అన్నారు. ప్రతీ న్యాయవాది చట్టాల మీద పూర్తి అవగాహన తో ఉండాలని అంతేగాక జాతీయ భావం, పేద ప్రజల పట్ల సేవాభావం కూడా కలిగి ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి కార్యదర్శి సునీల్, కేంద్ర కమిటీ సభ్యులు మేరెడ్డి నర్సింహా రెడ్డి, కవిత, గౌరీష్ జి, సోమంచి వెంకటేశ్వర్లు




,రాష్ట్ర కమిటీ సభ్యులు, మరియు నల్గొండ జిల్లా కార్యదర్శి చొక్కాల నాగరాజు , సీనియర్ న్యాయవాదులు నూకల నర్సింహా రెడ్డి, నూకల సంధ్యారాణి, పల్లె బోయిన శ్యామ్ సుందర్‌తో పాటు తెలంగాణ లోని అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, నల్గొండ జిల్లాలోని జిల్లా కమిటీ సభ్యులు రాంప్రసాద్, హరేరామకృష్ణ, రమేష్, నరేష్. ఏమిరెడ్డి సుమశ్రీ, వాణి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.




## పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

**'మన ఊరి న్యూస్' సీఈవో మసున లక్ష్మణ్ కుమార్**




**మైలర్ దేవ్ పల్లి, మర్చి 01 ( వార్త వేదిక సూర్య ) :** పరిసరాల పరిశుభ్రత అనేది కేవలం ఒక నినాదం కాదని, అది ప్రతి పౌరుడి నైతిక బాధ్యత అని 'మన ఊరి న్యూస్' సీఈవో మసున లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం జల్‌పల్లి డివిజన్ పరిధిలోని శ్రీరామ కాలనీలో నిర్వహించిన భారీ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, స్థానిక ప్రజలు మరియు విద్యార్థులతో కలిసి స్వచ్ఛతపై గళం విప్పారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. మనం చేసే చిన్న పొరపాటు సమాజంపై పెద్ద ప్రభావాన్ని చూపుతుంది. ఇంట్లోని చెత్తను రోడ్లపై పారవేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి, అవి రోగకారక క్రిములకు నిలయాలుగా మారుతున్నాయి. ఒకరిద్దరు చేసే అశ్రద్ధ వల్ల కాలనీ మొత్తం అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వ్యవస్థను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇంటి వద్దకు వచ్చే మునిసిపల్ వాహనాలకు మాత్రమే చెత్తను అందజేసి, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భవిష్య స్కూల్ మరియు కోటి విద్యాలయం పాఠశాలల విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని కాలనీ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను విడదీయడం (తడి, పొడి చెత్త) మరియు సరైన పద్ధతిలో పారవేయడంపై అవగాహన కల్పించారు. మన పరిశుభ్రత' అనే నినాదంతో అందరూ కలిసి పని చేయాలని లక్ష్మణ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల యాజమాన్యం, స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## కార్పొరేటర్‌గా విజయం సాధించిన కేసాని వేణుగోపాల్ రెడ్డికి విద్యానగర్ వసుధ టవర్స్ అపార్ట్మెంట్స్ వాసులు అభినందనలు

**నల్లగొండ టౌన్ బ్యూరో (వార్త వేదిక సూర్య) మార్చ్ 1 .** నల్గొండ కార్పొరేషన్ 41 డివిజన్ కార్పొరేటర్ గా ఘన విజయం సాధించిన కేసాని వేణుగోపాల్ రెడ్డి కి విద్యానగర్ వసుధ టవర్స్ అపార్ట్మెంట్స్ వాసులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి పూలే బొక్కే అందజేశారు గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా వేణుగోపాల్ రెడ్డి పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయడంతో. నిత్యం ప్రజల మధ్య అందుబాటులో ఉంటారని అపార్ట్మెంట్ వాసులు కొనియాడారు ఎవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందించి వేణుగోపాల్ రెడ్డి సొంతం అని అందుకే నూతనంగా ఏర్పడ్డ నల్గొండ కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌గా ఘనవిజయం సాధించారని గుర్తు చేశారు అందరికీ ఆత్మీయుడుగా గుర్తింపు పొందిన వేణుగోపాల్ రెడ్డి భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని పదవులు అధిష్టించాలని వారి ఆకర్షించారు కార్యక్రమంలో వసుధ టవర్స్ అపార్ట్మెంట్ వాసులు ఆత్మీయుడుగా గుర్తింపు పొందిన వేణుగోపాల్ రెడ్డి భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని పదవులు అధిష్టించాలని వారి ఆకర్షించారు కార్యక్రమంలో వసుధ టవర్స్ అపార్ట్మెంట్ వాసులు తుమ్మల లింగస్వామి రెడ్డి మేరెడ్డి జనార్దన్ రెడ్డి వాసుదేవులు రమేష్ అప్పారావు చంద్రశేఖర రావు తదిరులు పాల్గొన్నారు.





## 22 వ వార్డులో ఇఫ్తార్ విందు



నల్లగొండ బ్యూరో, మార్చి 1 (వార్తా వేదిక సూర్య )

22 వ వార్డు లోని సఫా పబ్లిక్ స్కూల్ ఎదురుగా ఆదివారం ఎంఐఎం ఇన్చార్జ్ మహ్మద్ హుస్సేన్ యూత్, సమత్ యూత్ ఐకాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కు ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ అమీర్ హాజరైయ్యారు. ఈ ఇఫ్తార్ విందు కు భారీగా ముస్లిం యువత, ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో సమత్, అశ్వత్, నజీర్, లతీఫ్, రమిష్, ముజ్జు, ఫయాజ్, మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

## అరుదైన 'బ్లడ్ మూన్'



నల్లగొండ బ్యూరో, మార్చి 1 (వార్తా వేదిక సూర్య)

ఆకాశంలో అద్భుతమైన ఖగోళ దృశ్యం ఆవిష్కృతం కానుంది. 2026 మార్చి 3న సంపూర్ణ చంద్రగ్రహణం సమయంలో చంద్రుడు రాగి–ఎరుపు రంగులో మెరుస్తూ కనిపించనున్నాడు. ఈ ప్రత్యేక దృశ్యాన్నే ప్రజలు సాధారణంగా "బ్లడ్ మూన్" అని పిలుస్తారు. భూమి సూర్యుడు, చంద్రుడు మధ్యలోకి రావడంతో, భూమి నీడ చంద్రుడిపై పడుతుంది. ఈ సమయంలో భూవాతావరణం వడగట్టిన సూర్యకిరణాలు చంద్రుడిని ఎర్రటి కాంతితో కప్పేస్తాయని చెబుతున్నారు.

### ఎక్కడెక్కడి నుంచి వీక్షించవచ్చు?

ఈ సంపూర్ణ చంద్రగ్రహణాన్ని అమెరికాస్, ఆసియా, ఓషియానియా ప్రాంతాల్లోని దాదాపు 3.3 బిలియన్ మంది వీక్షించే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే, ఈ ప్రాంతాల్లో గ్రహణం స్పష్టంగా కనిపిస్తుంది. కొన్నిచోట్ల గ్రహణం పూర్తి దశలో ఉండగా, మరికొన్నిచోట్ల పాక్షిక దశ మాత్రమే కనిపించవచ్చు.

### ఎందుకు ఎర్రగా కనిపిస్తుంది?

చంద్రగ్రహణం సమయంలో భూమి వాతావరణం సూర్యకాంతిని వక్రీకరించి (ొాఞ్ఫవతీఅఅస్త్ర) ఎర్రటి తరంగదైర్ఘ్యాలను మాత్రమే చంద్రుడిపైకి చేరనిస్తుంది. ఇదే కారణంగా చంద్రుడు రాగి–ఎరుపు రంగులో మెరుస్తాడు. ఇది సూర్యాస్తమయం సమయంలో ఆకాశం ఎర్రగా కనిపించే ప్రక్రియతో సమానమే.

### టైమ్ అండ్ డేట్ లైవ్..

ఈ అద్భుత ఖగోళ దృశ్యాన్ని ఆన్‌లైన్‌లో ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ఉంది. యూట్యూబ్ ఛానెల్‌లో ఈఎస్టీ ఉదయం 4:30 గంటలకు (+మీ 09:30) ప్రసారం ప్రారంభమవుతుంది. లాస్ ఏంజిల్స్, వెస్టర్న్ ఆస్ట్రేలియా ప్రాంతాల నుంచి ప్రత్యక్ష వీక్షణలు అందుబాటులో ఉంటాయి. జర్నలిస్ట్ అన్నే బకిల్, ఖగోళ శాస్త్రవేత్త గ్రాహం జోన్స్ నిపుణుల వ్యాఖ్యానం అందిస్తారు.

### ఫోటోగ్రఫీకి సువర్ణావకాశం..

ఈ ఖగోళ సంఘటనను కెమెరాలో బంధించాలనుకునే వారికి ఇది అరుదైన అవకాశం. టెలిఫోటో లెన్స్, ట్రైపాడ్, మాన్యువల్ ఎక్స్‌పోజర్ సెట్టింగ్స్ ఉపయోగించడం ఉత్తమం. ×ూా తక్కువగా ఉంచి, షట్టర్ స్పీడ్‌ను సర్దుబాటు చేయడం ద్వారా స్పష్టమైన చిత్రాలు పొందవచ్చు. మీ బ్లడ్ మూన్ ఫోటోలను ాజూఖఎవ.ఙశీఎ రీడర్‌లతో పంచుకోవాలనుకుంటే, మీ పేరు, ప్రాంతం, చిన్న వివరణతో ంజూఖఎవజూఞ్ట్రశీశీంఏంజూఖఎవ.ఙశీఎ కు పంపవచ్చు.

### గ్రహణ దశలు ఎలా ఉంటాయి?

సంపూర్ణ చంద్రగ్రహణం ప్రధానంగా నాలుగు దశల్లో జరుగుతుంది:

పెనంబ్రల్ దశ

పాక్షిక దశ

సంపూర్ణ దశ

మళ్లీ పాక్షిక దశ

సంపూర్ణ దశలోనే చంద్రుడు అత్యంత ఎర్రగా మెరుస్తాడు. ఈ దశ కొన్ని నిమిషాల నుంచి గంట వరకు ఉండవచ్చు.

## సత్తా చాటిన టాటా మోటార్స్

నల్లగొండ బ్యూరో, మార్చి 1 (వార్తా వేదిక సూర్య)

ఫిబ్రవరి అమ్మకాల్లో రెండో స్థానాన్ని సాధించింది. దేశీయ ఆటోమేకర్ టాటా మరోసారి తన బలమైన మార్కెట్ ఉనికిని చాటిచెప్పింది. ఫిబ్రవరి 2026 అమ్మకాల్లో దేశీయ, ఎగుమతి మార్కెట్లలో అనూహ్యంగా మంచితీరును కనబరిచింది. ఫిబ్రవరి నెలలో మొత్తం 63,331 కార్లను విక్రయించింది. హ్యుందాయ్, మహీంద్రాలను అధిగమించింది. మొత్తం 63,331 యూనిట్లను విక్రయించింది. ఫిబ్రవరి 2025లో, ఈ సంఖ్య 46,811 యూనిట్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే సేల్స్ 35 శాతం పెరిగాయి. దేశీయ మార్కెట్‌లో కొత్త మోడళ్లను టాటా తీసుకురావడంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. టాటా హారియర్ పెట్రోల్, హారియర్ ఎలక్ట్రిక్, టాటా సఫారీ పెట్రోల్, టాటా పంచ్ పెట్రోల్, ఎలక్ట్రిక్ ఫేస్‌లిఫ్ట్, టాటా సియెర్రా వంటి మోడళ్లు ఉన్నాయి. ఇవి అమ్మకాల బలాన్ని పెంచాయి. ఎలక్ట్రిక్ కార్ మార్కెట్‌లో టాటా ఇప్పటికే అగ్రగామిగా ఉంది. టాటా నుంచి టియాగో, టిగోర్, పంచ్, నెక్సాన్, హారియర్ ఈవీలు ఉన్నాయి. మొత్తం ఈవీ సేల్స్‌లో 57 శాతం టాటా కార్లే ఉన్నాయి. సేఫ్టీతో పాటు టెక్ ఫీచర్లకు కూడా టాటా ప్రాధాన్యత ఇస్తుండటంతో వినియోగదారులు ఇంట్రెస్ట్ చూపుతున్నారు. విదేశీ మార్కెట్లలో కూడా టాటా కార్లకు డిమాండ్ పెరిగింది, దీనివల్ల ఎగుమతులు ఏకంగా 167% వృద్ధి చెందాయి.

ఫిబ్రవరి కార్ సేల్స్ వివరాలు:

1) మారుతి సుజుకి: 1.64 లక్షలు

2) టాటా మోటార్స్: 62,329

3) మహీంద్రా: 60,018.






# మెట్రో వాటర్ బిల్లులతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారు

- బిఆర్ఎస్ నేతల ఆవేదన
- అసంపూర్తిగా కమ్యూనిటీ హాల్.. అప్పుడే ఊడుతున్న పెచ్చులు
- అధికారుల నిర్లక్ష్యంపై నిరసన
- మీ సమస్య - మా బాధ్యత: శివాజీ నగర్‌లో ప్రజా సమస్యల గుర్తింపు

మైలర్ దేవ్ పల్లి, మర్చి 01 ( వార్త వేదిక సూర్య ) :

మణికొండ పురపాలక పరిధిలోని శివాజీ నగర్ ప్రాంతంలో 'మీ సమస్య – మా బాధ్యత, ప్రజలతో – ప్రజల కోసం' కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ నాయకులు ఆదివారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ఎదుర్కొంటున్న సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొస్తూ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ల బిల్లులు ఒక్కసారేనా? గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వీకర్ సెక్షన్ మరియు హరిజన బస్తీలకు కేవలం ఒక రూపాయికే నీటి సరఫరా అందించేవారని, కానీ ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారులు గత ఐదు సంవత్సరాల బిల్లులను ఒక్కసారిగా వేసి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఎటువంటి సాంకేతిక పద్ధతి లేకుండా, భారీ మొత్తంలో బిల్లులు వేసి, వాటిని చెల్లించాలని దౌర్జన్యంగా ఒత్తిడి చేయడంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడం శోచనీయమని నాయకులు పేర్కొన్నారు. నీటి బిల్లుల వేధింపులపై స్థానిక మహిళలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మరియు అధికారులు తమ వైఖరి మార్చుకోకపోతే, చట్ట పరిధిలోనే జలమండలి కార్యాలయాన్ని ఘెరావ్ చేసి, దిగ్బంధం చేస్తామని మహిళలు హెచ్చరించారు. అసంపూర్తిగా కమ్యూనిటీ హాల్.. ఊడుతున్న పెచ్చులు స్థానికుల సౌకర్యార్థం నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, నిర్మించిన కొద్ది భాగంలోనే సీలింగ్ పెచ్చులు ఊడిపోవడం నాణ్యతా లోపానికి నిదర్శనమని స్థానికులు మొరపెట్టుకున్నారు. సీతారాం ధూళిపాళ ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి తాము అండగా ఉంటామని, అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో



చట్టపరంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, ఏర్పుల శ్రీకాంత్, కొలుగూరి జై రామ్, యాలాల కిరణ్, సుమనళిని, కందాడ ప్రవీణ్ కుమార్, బాబు రావు, బొడ్డు శ్రీధర్, శ్రీశైలం, కన్ని, అఖిల్, శశాంక్, రాజేష్, తిమోతి, రఘు వంశీ, ముత్యాలు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.






# మార్చి 14,15 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభలు

### సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ బ్యూరో, మార్చి 1 (వార్తా వేదిక సూర్య)

సిఐటియు నల్గొండ జిల్లా 13 వ మహాసభలు ఈనెల 14,15 తేదీల లో నల్గొండ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి తెలిపారు. ఆదివారం సీఐటీయూ నల్గొండ జిల్లా విస్తృతస్థాయి సమావేశం దొడ్డి కొమరయ్య భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, కార్మికుల పోరాటాల సారధి సిఐటియు నల్లగొండ జిల్లా 13 వ మహాసభలు పోరాటాల పురిటీగడ్డ నల్లగొండపట్టణంలో 2026 మార్చి 14,15 తేదీలలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ మహాసభలలో జిల్లాలోని 33 మండలాల నుండి జిల్లావ్యాపితంగా వివిధ యూనియన్స్ నుండి 500 మంది ప్రతినిధులు, అఖిల భారత మరియు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని అన్నారు.ఐక్యత పోరాటం నినాదంతో 1970 లో సిఐటియు ఏర్పడినప్పటి నుండి దేశంలో కార్మికవర్గ హక్కుల కోసం అనేక పోరాటాలు చేసింది. సిఐటియు కేవలం కార్మికుల హక్కులే కాకుండా, రైతాంగము, వ్యవసాయ కార్మికులు, సామాజిక సంఘాల పోరాటాలకు సంఘీభావంగా అండగా నిలుస్తుంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకరణ విధానాలకు వ్యతికంగా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్నది. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే విధంగా 2020 సంవత్సరంలో పార్లమెంట్లో బిల్లు 29 కార్మిక చట్టాలను రద్దు పరిచే విధంగా పార్లమెంటులో చట్టం తెచ్చి నాలుగు లేబర్ కోడ్లను అమలుకు ప్రయత్నిస్తున్నది ఈ విధానాలకు వ్యతిరేకంగా గత ఐదు సంవత్సరాలుగా దేశంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున కార్మికుల పోరాటాల ఫలితంగా వాటిని నివారించగలుగుతున్నాం. స్వాతంత్రం నాటినుండి ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే విమానయానం ఓడరేవులు టెలికం ఇన్సూరెన్స్ బొగ్గు గనులు బ్యాంకింగ్ ఉక్కు పరిశ్రమలు అన్నింటిని కారు చౌకగా (అంబానీ ఆదానీ లకు) కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పుతు దేశ సంపదను సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ పరిశ్రమలతో పాటు 73 షెడ్యూల్డ్ పరిశ్రమలలో గత ఏడు సంవత్సరాలుగా కనీస వేతనాలు జీవోలను సవరించటం లేదు. గ్రామపంచాయతీ మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అశా, అంగన్వాడీ మధ్యాహ్నభోజన కార్మికులు, విఓఏ, ఉపాధి హామీ, ఫీల్డు అసిస్టెంట్ లతో పాటు అనేక రకాలు పార్ టైమ్, గౌరవ వేతన ఉద్యోగులకు వేతనాలు పెంచటం లేదు. భవన నిర్మాణం, హమాలీ, ట్రాన్స్పోర్టు, కార్మికులు సంక్షేమము గాలికి వదిలేసినది. అన్నిరకాల అసంఘటిత కార్మికుల హక్కులు కాలరాయబడుతున్నది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సంఘటిత అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికులకు అనేక వాగ్దానాలు చేసినది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వాగ్దానాల అమలుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో కార్మిక వర్గం తీవ్ర అసంతృప్తికి గురి అవుతున్నదని అన్నారు.జిల్లాలో రాబోవు రోజుల్లో కార్మికుల పక్షాన మరిన్ని పోరాటాలు ఆందోళనలు నిర్వహించేందుకు మార్చి 14,15 తేదీలలో నల్లగొండ పట్టణంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభలు వేదికగా కానున్నాయి. ఈ మహాసభలో కార్మికుల ఆర్థిక, సామాజిక సమస్యలపై చర్చలు జరగనున్నాయి. కార్మిక, కర్షక మైత్రి ద్వారానే పాలకుల దుష్ట విధానాలను తిప్పికొట్టగలమని అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎండి సలీం, జిల్లా కోశాధికారి బాణాల పరిపూర్ణాచారి జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికార్ మల్లేష్, అవుత సైదులు, సహాయ కార్యదర్శులు దండెంపల్లి సత్తయ్య, చింతపల్లి బయన్న, మల్లు గౌతమ్ రెడ్డి, నల్ల వెంకటయ్య, ఏర్పుల యాదయ్య, పెంజర్ల సైదులు, రొండి శ్రీను, భూలక్ష్మి, వెంకటమ్మ,బొందు పార్వతి సునీత లకపాక రాజు, పోలే సత్యనారాయణ, అవుట రవీందర్,అద్దంకి నరసింహ, ఆదిమల్ల సుధీర్, జేరిపోతుల ధనంజయ్, వరికుప్పల ముత్యాలు, ఎస్.కె బషీర్, పొన్న అంజయ్య, సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

# తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

నల్లగొండ బ్యూరో, మార్చి 1 (వార్తా వేదిక సూర్య)

గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు ఒకటో తేదీన శుభవార్త లభించింది. మార్చి 1వ తేదీన దేశంలోని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు శుభవార్త చెప్పాయి. గ్యాస్ సిలిండర్ ధరలని సవరించాయి. హోలీ పండుగకి ముందే గ్యాస్ వినియోగదారులు ఉపశమనం లభించింది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గిస్తున్నట్లు ఈ రోజు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రకటించాయి. తాజా నిర్ణయంతో గ్యాస్ వినియోగదారులకి కొత్త ఊరట లభించినట్లయింది. దేశంలోని మెట్రో నగరాల్లో 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధరని రూ. 31 మేర తగ్గిస్తున్నట్లు ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి. సవరించిన ఈ కొత్త గ్యాస్ సిలిండర్ ధరలు మార్చి 1 నుంచే అమల్లోకి వస్తాయని తెలిపాయి. అయితే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదని వెల్లడించాయి. సాధారణంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెలా 1వ తేదీన వంట గ్యాస్ సిలిండర్ ధరలను సమీక్షిస్తాయి. ధరలు పెంచడం లేదా తగ్గించడం లేదా యథాతథంగా కొనసాగించడం వంటివి చేస్తుంటాయి. ఇలా సవరించిన న్రా+ గ్యాస్ సిలిండర్ ధరలు ప్రతి నెలా 1వ తేదీ నుంచి అమలులోకి తీసుకొస్తుంటాయి. అంతర్జాతీయ చమురు ధరలు, ట్యాక్సేషన్ పాలసీలు, సరఫరా – డిమాండ్ వంటి కారణాలతో గ్యాస్ సిలిండర్ ధరలను నిర్ణయిస్తారు. తాజా గ్యాస్ సిలిండర్ ధరల తగ్గింపు తర్వాత హైదరాబాద్ లో 19 కేజీల కమెర్షియల్ సిలిండర్ ధర రూ.31 తగ్గి రూ. 1930.50 వద్దకు తగ్గింది. విజయవాడలో 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర రూ. 31 తగ్గి రూ. 1867.50 వద్దకు దిగొచ్చింది. దేశ రాజధాని ఢిల్లీలో 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర రూ.31 తగ్గి రూ. 1709గా ఉంది. కోల్‌కత్తాలో 19 కేజీల వాణిజ్య సిలిండర్ రేటు రూ.31 తగ్గడంతో రూ. 1844.5 వద్దకు దిగివచ్చింది. ముంబైలో రూ. 1692 గా ఉండగా బెంగళూరులో రూ. 1783, చెన్నైలో రూ. 1899.5గా రేట్లు ఉన్నాయి.

మరోవైపు 14 కిలోల గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు మార్చలేదు. ఈరోజు హైదరాబాద్లో డొమస్టిక్ గ్యాస్ సిలిండర్ రేటు రూ. 905 గా ఉంది. విజయవాడలో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రేటు రూ. 877.50, దేశ రాజధాని ఢిల్లీలో రూ. 853 గా, కోల్‌కత్తాలో రూ. 879 వద్ద ఉన్నాయి. ముంబైలో రూ. 852.5, ఇక చెన్నైలో రూ. 868.50 గాను రేట్లు ఉన్నాయి. బెంగళూరులో ఒక్కో సిలిండర్ ధర రూ. 855.50గా ఉంది.






# మీటర్ రీడింగ్ కార్మికులద గోడు విన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

### రెండు నెలల్లో సమస్యల పరిష్కారానికి హామీ..

### లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరిక

మైలర్ దేవ్ పల్లి, మర్చి 01 (వార్త వేదిక సూర్య) :

రాష్ట్రంలోని విద్యుత్ మీటర్ రీడింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, వారికి న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చారు. ఆదివారం కార్మికుల ప్రతినిధులు ఆయనను కలిసి తమ దీనస్థితిని వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. గత 10–15 ఏళ్లుగా విద్యుత్ శాఖలో సేవలందిస్తున్నా తమకు కనీస గుర్తింపు లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు కేవలం రూ. 4,000 నుండి 7,000 లోపే వేతనం ఇస్తున్నారని, అది కూడా సకాలంలో అందడం లేదని మల్లన్న దృష్టికి తీసుకెళ్లారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ వంటి కనీస సౌకర్యాలు లేకపోవడం, విపరీతమైన పనిభారం, టార్గెట్ల పేరుతో వేధింపులు ఎదుర్కొంటున్నామని వివరించారు. కార్మికుల సమస్యలపై స్పందించిన తీన్మార్ మల్లన్న పని చేసే వారికి కష్టానికి తగ్గ ప్రతిఫలం, గౌరవం దక్కాలి. ఔట్‌సోర్సింగ్ కార్మికుల హక్కుల కోసం శాసన మండలి వేదికగా పోరాడతాను అని స్పష్టం చేశారు. వచ్చే రెండు నెలల్లో ప్రభుత్వం మరియు అధికారులతో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. ఒకవేళ గడువులోగా స్పందన లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.తమ డిమాండ్ల సాధనకై సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు కార్మికులు సిద్ధమయ్యారు. తమ గోడు విన్నందుకు ఎమ్మెల్సీ మల్లన్నకు కృతజ్ఞతలు తెలుపుతూ, తమకు త్వరలోనే న్యాయం జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.





# కాణిపాకం ఆలయానికి కొత్త గోశాల ఏర్పాటు

**హైదరాబాద్, మర్చి 01 (వార్త వేదిక సూర్య) :**
ఏపీలో ప్రముఖ పుణ్యక్షేత్రం చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి మహర్దశ పట్టనుంది. స్వామి వారి ఆలయంలో ప్రస్తుతం ఉన్న గోశాలతో పాటు కొత్తగా మరో గోశాల ఏర్పాటు కానుంది. అందుకు 10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి గోశాలను ఏర్పాటు చేయనున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ వెల్లడించారు. ఆలయ ఛైర్మన్ ఎం.మణి నాయుడుతో కలిసి పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో పాలకమండలి సమావేశం నిర్వహించారు. అందుకు సంబంధించిన వివరాలను మీడియాకు తెలియజేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తయారు చేసిన రూ.141.65 కోట్ల ఆలయ బడ్జెట్ అంచనాలకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. తవణంపల్లె మండలం కె.పట్నం వద్ద ఆలయానికి 18.60 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఇటీవల ఏపీ ప్రభుత్వ కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. దాంతో పాటుగా ఆలయంలో భూగర్భ విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. కాంట్రాక్ట్ బేసిస్ కింద పని చేస్తున్న 109 మంది ఉద్యోగులను యథావిధిగా పాత పద్ధతిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ కమిషనర్‌కు ఆలయ కమిటీ తరఫున లేఖ రాస్తామని వివరించారు. ఇక తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం (ఫిబ్రవరి 28) టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఒంటిమిట్టలో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం, డ్రై ఐలాండ్ నిర్మాణానికి రూ.20.17 కోట్లు మంజూరు చేస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ ఆలయాల్లో పరిచారకులుగా పనిచేస్తున్న 51 మందికి అర్చకులుగా పదోన్నతి కల్పించే విషయమై ఏపీ ప్రభుత్వానికి నివేదించాలని డిసైడ్ అయ్యారు. దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ ఆలయాలు, ఆసుపత్రులు, సత్రాలు, కల్యాణ మండపాల భద్రతను పర్యవేక్షించేందుకు తిరుపతిలోని పరిపాలన భవనంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. అందుకు రూ.10.75 కోట్లు ఖర్చు చేయనున్నారు. అలిపిరి తనిఖీ కేంద్రంలో రూ.8 కోట్లతో నూతన ఎక్స్-రే బ్యాగేజ్ స్కానర్లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

# సీబీఎస్సీ 10వ, 12వ తరగతి పరీక్షలు వాయిదా..?



దేశ వ్యాప్తంగా సీబీఎస్సీ బోర్డు పరీక్షలు ఫిబ్రవరి 17వ తేదీ నుంచి మొదలైన సంగతి తెలిసిందే. పదో తరగతి పరీక్షలు మార్చి 10 వరకు, 12వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 10 వరకు కొనసాగనున్నాయి. భారత్‌తోపాటు విదేశాల్లోనూ ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బోర్డు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ( జదీూజు ) పరీక్షల కంట్రోలర్ సన్యమ్ భారద్వాజ్ కీలక ప్రకటన చేశారు. మార్చి 7, 2026న మిడిల్ ఈస్ట్ దేశాలలో జరగాల్సిన 10వ తరగతి, 12వ తరగతి బోర్డు పరీక్షలను వాయిదా వేసినట్లు న్యూస్ ఒకటి ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతుంది. ఈ మేరకు ఆదివారం (మార్చి 1, 2026న) అధికారిక సర్క్యులర్ ద్వారా ప్రకటన విడుదల చేసినట్లు ప్రచారం అవుతుంది. ఇందులో అమెరికా - ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలోని కొన్ని దేశాల్లో ప్రస్తుత పరిస్థితుల కారణంగా పరీక్షలు వాయిదా పడినట్లు సదరు సర్క్యులర్ పేర్కొంది. ప్రభావిత దేశాల్లో బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) ఉన్నాయి. ఈ సర్క్యులర్ ఈ ప్రాంతాలలోని సీబీఎస్సీ అనుబంధంగా ఉన్న పాఠశాలల్లో మార్చి 7వ తేదీన జరగనున్న పదవ తరగతి, పన్నెండో తరగతి సోషల్ సైన్స్ పరీక్షలు వాయిదా పడినట్లు పేర్కొంది. అంతేకాకుండా ఫిబ్రవరి 28 వరకు జరిగిన లాంగ్వేజ్ పరీక్షలు రద్దు అయ్యాయని కూడా ఇందులో ప్రస్తావించింది. ఈ పరీక్షలకు సంబంధించిన కొత్త తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని ఆ ప్రకటనలో ఉంది. దీంతో ఈ పరీక్షల వాయిదా వ్యవహారం కాస్తా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. దీనిపై తాజాగా సీబీఎస్సీ బోర్డు సోషల్ మీడియా వేదికగా స్పందించింది. దుబాయ్ సీబీఎస్సీ కార్యాలయం జారీ చేసినట్లు చక్కర్లు కొడుతున్న సదరు సర్క్యులర్ పూర్తిగా అవాస్తవమని కొట్టివేసింది. ఇలాంటి ప్రకటన ఏదీ తాము చేయలేదని స్పష్టం చేసింది. విద్యార్థులు గందరగోళానికి గురికావొద్దని, అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారాన్ని మాత్రమే విద్యార్థులు పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. దీనిపై దుబాయ్‌లోని జదీూజు ప్రాంతీయ కార్యాలయం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్, విదేశీ జదీూజు పాఠశాలల అధిపతి డాక్టర్ రామ్ శంకర్ కూడా ఇప్పటికే జదీూజు ప్రధాన కార్యాలయానికి వివరణాత్మక నివేదికను సమర్పించారు. నకిలీ సర్క్యులర్‌లోని విషయాలను డాక్టర్ శంకర్ తోసిపుచ్చారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సీబీఎస్సీ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లు, వెబ్‌సైట్‌లను మాత్రమే విశ్వసించాలని హెచ్చరించారు. స్థానిక నియంత్రణ సంస్థలు, భారత రాయబారి, కాన్సుల్ జనరల్, జదీూజు ఛైర్మన్‌లతో చురుకుగా సంప్రదింపులు జరుపుతున్నట్లు ధృవీకరించారు. పరీక్షల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని, షెడ్యూల్ ప్రకారం యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. కాగా సీబీఎస్సీ బోర్డు పరీక్షలు ప్రస్తుతం భారతదేశం అంతటా 10వ తరగతికి 8,074 కేంద్రాలలో, 12వ తరగతికి 7,574 కేంద్రాలలో, విదేశాలలో 26 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్నాయి. మొత్తం 43 లక్షలకు పైగా విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు.

## ఎస్ఆర్ఎంలో ఘనంగా టెక్నో కల్చరల్ ఫెస్ట్



**హైదరాబాద్, మర్చి 01 (వార్త వేదిక సూర్య) :**
ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నాలుగు రోజులు పాటు పండగ వాతావరణంలో జరిగిన టెక్నో కల్చరల్ ఫెస్ట్ ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిసింది. విద్యార్థుల ఆటలు, పాటలు డాన్సులు, ఫ్యాషన్ షోలతో పాటు మేదస్సుకు పదును పెట్టే టెక్నికల్ పోటీలు వేడుకగా జరిగాయి. యూనివర్సిటీలోని ఎనిమిది వేల మందికిపైగా విద్యార్థులు, ఉద్యోగులు వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొని మరచిపోలేని అనుభవాలను, ఆనందాన్ని సొంతం చేసుకున్నారు. శని ఆదివారాల్లో జరిగిన మ్యూజికల్ షోలో ప్రఖ్యాత సినీ నేపద్య గాయకులు కార్తీక్, జ్యోతికా గాంధీలు మధురమైన మెలోడీ గేయాలను ఆలపించి విద్యార్థులను ఆనంద డోలికల్లో తెలియాడించారు. అదేవిధంగా డీజే గౌతం ప్రదర్శన విద్యార్థి లోకాన్ని ఎంతగానో ఆకట్టుకుంది. హెకదాన్లు , రోబోటిక్స్ ఛాలెంజస్, కోడింగ్ పోటీలు, వర్క్ షాపులు తదితర పోటీల్లో విజేతలైన విద్యార్థులను యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సతీష్ కుమార్, రిజిస్టర్ ప్రేమ్ కుమార్లు ప్రత్యేకంగా అభినందించారు . నాలుగు రోజులపాటు ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించిన విద్యార్థి విభాగం డైరెక్టర్లు గురుప్రీత్సింగ్ , రేవతి బాలకృష్ణ, సిఎల్ఎం డైరెక్టర్ అనుప్ సింగ్‌లతో పాటు స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ నివేద శ్రీరాములకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రశంసలు అందజేశారు.

## ఎట్టకేలకు జెఎన్‌యు విద్యార్థి నేతల విడుదల



**హైదరాబాద్, మర్చి 01 (వార్త వేదిక సూర్య) :**
జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘ నేతలు ఎట్టకేలకు విడుదలయ్యారు. ఆదివారం రాత్రి 14 మంది విద్యార్థి నాయకులు తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. కుల వివక్షను తొలగించడానికి యుజిసి నిబంధనలను అమలు చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని పోరాడిన జెఎన్‌యు విద్యార్థి సంఘ నేతలపై బలప్రయోగానికి పాల్పడటంతోపాటు కేంద్ర ప్రభుత్వం తీహార్ జైల్లో పెట్టింది. ఈ నెల 26న ఆందోళన చేసిన 51 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిలో 37 మందిని పోలీసులు విడుదల చేశారు. విద్యార్థి సంఘం ఆఫీస్ బేరర్లు అదితి మిశ్రా (అధ్యక్షురాలు), కె.గోపికా బాబు (వైస్ ప్రెసిడెంట్), డానిష్ అలీ (జాయింట్ సెక్రటరీ) సహా 14 మంది విద్యార్థి నేతలను జైలులో పెట్టారు. వారికి శుక్రవారం పాటియాలా హౌస్ కోర్టు బెయిల్ మంజూరు చేసినా.. జైలు అధికారులు తాత్సారం చేశారు. ఎట్టకేలకు ఆదివారం రాత్రి విడుదల చేశారు.

## అక్రమాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు

**కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు**

**పీడీఎస్ బియ్యం అక్రమార్కుల నుంచి గౌస్ ఆలం డబ్బులు వసూలు చేస్తున్నారు**



**హైదరాబాద్, మర్చి 01 (వార్త వేదిక సూర్య) :**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పలు తీవ్ర ఆరోపణలు చేశారు. అక్రమాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, 15 రోజుల్లో ఆయనపై చర్యలు తీసుకోకపోతే సీపీ చేస్తున్న అన్ని అక్రమాలకు సంబంధించిన ఆధారాలు వీడియోలతో సహా త్వరలో అసెంబ్లీ, మీడియా సాక్షిగా బయటపెడతానని హెచ్చరించారు. 'కరీంనగర్ సీపీ బచ్చాగాడు, ఆయన వయస్సు 40 యేండ్ల కంటే చిన్ననే..'అని వ్యాఖ్యానించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. 'పీడీఎస్ బియ్యం అక్రమార్కుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. 337 మంది హోంగార్డుల బదిలీ కోసం రూ.కోటి తీసుకున్నారు. ప్రభుత్వ వాహనాలు ప్రైవేటు వ్యక్తుల కోసం ఉపయోగిస్తున్నారు. టీఎస్ 09 పీఏ 4195 ఇన్నోవా వాహనాన్ని సీపీ గౌస్ ఆలం తన మిత్రుడు, ఐఆర్ఎస్ అధికారి వికాస్ అగర్వాల్ తండ్రి కోసం వినియోగిస్తున్నారు. ఇద్దరు కానిస్టేబుళ్లు డ్రైవర్లుగా ఉన్నారు. టీఎస్ 09 పీఏ 5601 ఇన్నోవా కారు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం సోదరుడిని కాలేజీలో డ్రాప్ చేసేందుకు రోజు చలిమెడ వెళ్తుంది. ప్రైవేటు పౌరుల కోసం ప్రభుత్వ వాహనాల వాడకంపై డీజీపీ శివధర్‌రెడ్డి సమాధానం చెప్పాలి. సీపీ సతీమణికి కరీంనగర్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఎలా వచ్చిందో తెలుసు. ఆమె కోసం ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు డ్యూటీ చేస్తున్నారు. ఇక ఆయన ఇంట్లో 20 మంది కానిస్టేబుళ్లు పని చేస్తున్నారు..'అని కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. వసూళ్ల కోసం ఏసీపీ, సీఐని పెట్టుకున్నారు.. 'బియ్యం అక్రమార్కుల నుంచి డబ్బులు వసూలు చేయించేందుకు ఏసీపీ విజయ్‌కుమార్, సీఐ సృజన్‌రెడ్డిని సీపీ పెట్టుకున్నారు. జనవరి 8న ఎన్ఎన్ ఫ్రైడ్ మాల్‌కు ఎన్ఓసీ ఇచ్చేందుకు ఆ మాల్ యజమాని దగ్గర నుంచి రూ.25 లక్షలు వసూలు చేశారు. నేను చెప్పింది అబద్ధం అయితే నా ముక్కు నేలకు రాసేందుకు సిద్ధం. చర్యలు తీసుకోకపోతే వీడియోలు బయట పెడతా. ఆ తర్వాత ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ బాధపడకూడదు. ఎందుకంటే నేను ఆ వీడియోలు బయట పెడితే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తలదించుకునే పరిస్థితి వస్తుంది. 15 రోజుల తర్వాత హుజూరాబాద్ ఏసీపీ, జమ్మికుంట సీఐ ఏమేం పనులు చేస్తున్నారో అన్నీ బయట పెడతా..'అని కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు.

# బండపల్లి శ్రీలక్ష్మివేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం



**హైదరాబాద్, మర్చి 01 (వార్త వేదిక సూర్య) :**
బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండలంలోని బండపల్లి శ్రీలక్ష్మివేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ మూర్తులను ఆశీనులను చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంతులచారి ఆధ్వర్యంలో వేద పండితులు కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మొదట ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్కం మల్లేశం, అలయ కమిటీ ఛైర్మన్ కొండ లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేష్, మాజి జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, పొద్దుపొడుపు లింగారెడ్డి, నాయకులు చిలుక అంజిబాబు, తిప్పని శ్రీనివాస్, పోతరాజు నగేష్, బైరగొని రమేష్, గడ్డం తిరుపతిరెడ్డి, ముస్కు పద్మ-మల్లారెడ్డి, బుర్ర శ్రీనివాస్, మొకిలె విజేందర్, అంబాల శ్రీకాంత్, మల్యాల గంగనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

**ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అన్న చెల్లెలు మృతి**



**హైదరాబాద్, మర్చి 01 (వార్త వేదిక సూర్య) :**
అనంతపురం జిల్లా కల్యాణదుర్గం మండలం గుబనపల్లి జాతీయ రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు, కారు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాద ధాటికి కారు నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అనంతపురం నుంచి రాయదుర్గానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను చేపట్టారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం కల్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.
మృతులను కర్ణాటకలోని ముదిగలకు చెందిన చంద్రకళ (32), ఆమె సోదరులు శివకుమార్ (36), హనుమంత రాయుడు (40)గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

# గుండెపోటుతో పదో తరగతి విద్యార్థిని దుర్మరణం




**హైదరాబాద్, మర్చి 01 (వార్త వేదిక సూర్య) :**
పొద్దుట్నుంచి గ్యాస్ట్రిక్ సమస్యతో ట్రీట్‌మెంట్ తీసుకున్న బాలిక.. ఫ్రెష్ అయిదామని ఇంటికి వెళ్లిన కాసేపటికే హార్ట్ ఎటాక్‌తో మరణించడంతో ఆమె తల్లిదండ్రులు తీవ్ర దు:ఖంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలంలోని వీరులపాడు గ్రామానికి చెందిన శీలం జాహ్నవి కంచికచర్ల పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. కుటుంబసభ్యులతో కలిసి కంచికచర్లలోనే నివాసం ఉంటోంది. కొంతకాలంగా జాహ్నవి గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్నది. దీంతో నిన్న కంచికచర్లలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆమెకు వైద్యులు చికిత్స అందించారు. అయితే ఇల్లు దగ్గరలోనే ఉండటంతో ఫ్రెష్ అయి వస్తామని తల్లిదండ్రులతో కలిసి జాహ్నవి ఇంటికి వెళ్లింది. బాత్‌రూంలో ఫ్రెష్ అవుతుండగా జాహ్నవికి ఛాతిలో నొప్పి వచ్చి కుప్పకూలింది. దీంతో హుటాహుటిన మళ్లీ అదే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ సీపీఆర్ అందించినప్పటికీ లాభం లేకుండా పోయింది. కాగా గుండెపోటుతో జాహ్నవి మృతిచెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు.

## స్పేస్ కిడ్జ్ ఇండియా నేతృత్వంలో రాకెట్ రూపకల్పన

**చెన్నై తీరంలో ప్రయోగం విజయవంతం**



**హైదరాబాద్, మర్చి 01 (వార్త వేదిక సూర్య) :**
జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా స్పేస్ కిడ్జ్ ఇండియా నేతృత్వంలో చెన్నై తీరంలో బాలికలు రూపకల్పన చేసిన రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. చెన్నైలోని ఉత్తండి బీచ్ వేదికగా ఆదివారం ఉదయం బాలికలు సిద్ధం చేసిన 'సాలిడ్ రాకెట్', స్వదేశీ సాంకేతికతతో తయారైన స్పేస్ కిడ్జ్ ఇండియా 'ఎలక్ట్రిక్ రాకెట్'లను విజయవంతంగా ప్రయోగించారు. పాఠశాల విద్యార్థినులు డిజైన్ చేసిన ఈ రాకెట్ 2 మీటర్ల ఎత్తు, 110 మిమీ వ్యాసం కలిగి 10 కిలోల బరువుతో ఉంది. ఈ రాకెట్ ప్రయోగం సుమారు ఒక కిలోమీటరు ఎత్తుకు దూసుకెళ్లింది. ఈ సందర్భంగా స్పేస్ కిడ్జ్ ఇండియా వ్యవస్థాపకురాలు డాక్టర్ శ్రీమతి కేసన్ మాట్లాడుతూ తమ బాలికలు రాకెట్లను నిరిమస్తూ భారతదేశాన్ని స్వావలంబన వైపు నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. టెక్నాలజీ రంగాల్లో మహిళా శక్తినిఈ ప్రయోగం చాటిచెప్పిందన్నారు.

## 2029లో వైఎస్ జగన్ సీఎం

**మాజీ మంత్రి కొడాలి నాని**



**హైదరాబాద్, మర్చి 01 (వార్త వేదిక సూర్య) :**
2029లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని మాజీ మంత్రి కొడాలి నాని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వేధింపులకు గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యుల్ని ఆదివారం కొడాలి నాని, ఇతర వైఎస్సార్‌సీపీ నేతలు పరామర్శించారు. అనంతరం, కొడాలి నాని మీడియాతో మాట్లాడారు. 'కూటమి బెదిరింపులకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడరు. కూటమి ప్రభుత్వం అంబటి కుటుంబసభ్యుల్ని తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. టీడీపీ నేతలు కావాలనే అంబటి రాంబాబును రెచ్చగొట్టారు.అంబటి రాంబాబు క్షమాపణలు చెప్పిన టీడీపీ నేతలు ఆయన ఇంటిపై దాడి చేసి ధ్వంసం చేశారు.పోలీసుల సమక్షంలో అంబటి ఇంటిపై దాడి జరిగింది. లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగానికి వైఎస్సార్‌సీపీ భయపడదు. 2029లో వైఎస్సార్‌సీపీ అధినేత, వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యం'అని స్పష్టం చేశారు.

# చౌటుప్పల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- ప్రభుత్వ వవిద్యారంగాన్ని కాపాడాలి
- ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల దోపిడిని అరికట్టి విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలి
- పెండింగ్లో నా స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు

**చౌటుప్పల్ ,వార్త వేదిక సూర్య మార్చి 1:**చౌటుప్పల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల హామీని నెరవేర్చాలని ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడ్చిన పాలక ప్రభుత్వాలే ప్రవేటు విద్యారంగంపైహామొగ్గు చూపడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు ఆదివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని ఎస్వీఆర్ కన్వెన్షన్ లో ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది, విశ్విత సాయి సమావేశం ప్రారంభత సూచికంగా స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యాలు కడిగిన అరుణ పతాకాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మేడబోయినహామమత ఆవిష్కరించారు, అనంతరం సమావేశం ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూహాచౌటుప్పల్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని 11 సంవత్సరాలు గాడుస్తున్న హామీగానే మిగిలిపోయిందని ప్రభుత్వాలు మారుతున్న గాని ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంలో పాలక ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కనపడటం లేదు, తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్లక్ష్యం నిర్లక్ష్యం చేస్తున్న పరిస్థితి ఉన్నది ప్రభుత్వ విద్యను ప్రభుత్వమే బలోపేతం చేయాల్సిన పాలక ప్రభుత్వాలే ప్రవేటు విద్య వైపు మగ్గుచూపే పరిస్థితి నెలకొందని, విద్యార్థులు అమలు చేయకుండా ఇష్టానుసారంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీలు చేస్తున్న పరిస్థితుల్లో ఉన్నది రాష్ట్రంలో దేశాల మంత్రి కేటాయించకుండా విద్యాశాఖ మంత్రిని కేటాయించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తా ఉన్నది పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నది, విద్యార్థులకు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది కళాశాలలో సర్టిఫికెట్లు ఇచ్చే పరిస్థితి లేదు అదే విధంగా దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్యూ)లో విద్యార్థులు, అధ్యాపకులపై జరిగిన అమానుష దాడిని ఎస్ఎఫ్ఐ (రాఖీ×) తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అండతోనే క్యాంపస్లలో ఏబీవీపీ గూండాలు స్వైరవిహారం చేస్తున్నారని మండిపడ్డారు. ముసుగులు ధరించి విద్యార్థినుల హాస్టళ్లలోకి చొరబడి, ఇనుప రాడ్లతో దాడి చేయడం పిరికిపంద






చర్య అని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను హింసతో అణచివేయలేరని, విద్యార్థి లోకం ఈ దాడులను ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.విద్యార్థి నాయకుల బహిష్కరణ ఎత్తివేయాలి: ఎం.మమత రాష్ట్ర సహాయ కార్యదర్శి మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యార్థి సంఘాన్ని ఎన్నికల తమ ప్రతినిధులను ఎన్నుకున్నారని వి.సి.ని వైఖరిని ప్రశ్నించినందుకు వారిని క్యాంపస్ నుండి బహిష్కరణ చేయడం దుర్మార్గపు చర్య తక్షణమే వారిపై బహిష్కరణ ఎత్తివేయాలి లేకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తాము. ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి మల్లేశం, జిల్లా కార్యదర్శి లావుడియ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, ఈర్ల రాహుల్ తిగుల్ల శ్రీనివాస్ ధరావత్ జగన్, సహాయ కార్యదర్శి పుట్టల ఉదయ్, ఇందు రాణి,గాయత్రి,జిల్లా కమిటీ సభ్యులు ప్రకాష్,శ్రవణ్ రెడ్డి,నరేందర్, ఈయన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటెపాక శివ, ఈర్లపల్లి ముత్యాలు , యుటిఎఫ్ జిల్లా నాయకులు యాదయ్య ,సైదులు, అరుణ, బంగారు నరసింహ, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు నంద, లక్ష్మీపతి ,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధు కృష్ణ, పల్లె శివ, గుండు నరసింహ, నరేష్ ,వెంకటేష్, వరుణ్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు..

# కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి

**- ఐద్వా మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి డిమాండ్**

**భువనగిరి/వార్త వేదిక సూర్య :**–అధికారంలోకి వస్తే మహిళలకు సంబంధించిన సమస్యలన్నింటినీ పరిష్కరించి వారి సంక్షేమానికి పెద్ద ఎత్తున పాటు పడతామని చెప్పి హామీలు ఇచ్చి గెలిచిన రెండు సంవత్సరాల్లో ఇచ్చిన హామీలకు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) భువనగిరి మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి విమర్శించారు.ఆదివారం ఐద్వా రాష్ట్ర కమిటీ పిలుపు భాగంగా ఒక్కరోజు సభ్యత్వ కార్యక్రమాన్ని భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో ఇంటింటికి ఐద్వా నాయకత్వంతో కలిసి సభ్యత్వం చేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ కానుక పేరుతో కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని, మహాలక్ష్మి కింద నెలనెలకు మహిళలకు రూ.2500 ఇస్తామని, విద్యార్థినీలకు స్కూటీలు, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు పింఛన్ పెంపు వంటి హామీలేవి అమలు చేయకుండా మొండి చెయ్యి చూపిస్తున్నదని అన్నారు. డ్వాక్రా గ్రూపులకు వడ్డీ లేని రుణాలు ఇస్తానని నేటికీ ఇవ్వడం లేదని, గ్యాస్ సబ్సిడీ కూడా అందడం లేదని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కూడా అమలు చేయలేదని కేవలం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మినహా ఏది అమలు చేయడం లేదని ఈ ఆర్టీసీ బస్సు కూడా అన్ని గ్రామాలకు రావడం లేదని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల మీద దాడ ులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని విమర్శించారు. నాటి మ నువాద సిద్ధాంతాన్ని మళ్లీ తీ సుకొచ్చి మహిళలను వంటింటికే పరిమితం చే యాలనే ఆలో చనలను చ ేస్తున్నదని అన్నారు. ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, విషయము పథకాల అమలు కోసం మహి ళలు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపుని చ్చారు. ఇంకా ఈ కార్యక్రమ ంలో ఐద్వా మండల సహాయ కార్యదర్శి కొండ హైమావతి, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షురాలు కూకుట్ల చొక్కాకుమారి, గ్రామానికి సంబంధించిన కొండ శోభారాణి, రాంపల్లి కృష్ణవేణి, రాంపల్లి కలమ్మ, ఎడ్ల జ్యోతి, ఎడ్ల పుష్ప, ఎడ్ల సునీత, ఆకారం తులసమ్మ, బొజ్జ హేమలత, మెరుగు సుశీల, మెరుగు మహేశ్వరి, గౌటి మంజుల తదితరులు పాల్గొన్నారు.




# మహిళల సమగ్ర అభివృద్ధి కి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

- టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
- సదాశివపేట మండలం చందాపూర్ గ్రామం లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి వార్త వేదిక సూర్య మార్చి 1:** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి అన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యోద్దేశమని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం సదాశివపేట మండలం చందా పూర్ గ్రామం లో ఆమె పర్యటించారు. గ్రామం లో నూతనంగా నిర్మిం చనున్న సిసి రోడ్, మహిళా సమాఖ్య భవనానికి, స్కూల్ కాంపౌండ్ నిర్మాణా నికి ఆమె శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గ్రామ ప్రజల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ను నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా గ్రామం లో ఇటీవలే నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే మహిళలకుఉచిత బస్సు అవకాశం కల్పించింది అన్నారు. మహిళలకు పావులా వడ్డీ రుణాలు, మహిళా సంఘాల కు పక్కా భవనాలు, పెట్రోల్ బంక్ లను సైతం ఏర్పాటు చేసిందన్నారు. భవిష్యత్తులో మహిళా సంఘాలకు బస్సులు కేటాయించి మహిళల తో నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఇలా



ప్రతీ విషయంలో మహిళల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుంది అన్నారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దన్న, గ్రామ సర్పంచ్ పట్లోళ్ల మల్లేష్ , ఉప సర్పంచ్ , వార్డు



మెంబర్లు , మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి కామ్రేడ్ సంగు రవీందర్ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి

- కొండమడుగు నర్సింహ, గద్దె నర్సింహ లు పిలుపు

**యాదాద్రి భువనగిరి బ్యూరో. మార్చి 1 వార్తావేదిక సూర్య:** అమరజీవి కామ్రేడ్ సంగు రవీందర్ 11వ వర్ధంతి స్ఫూర్తితో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, సిపిఎం సీనియర్ నాయకులు గద్దె నర్సింహ పిలుపునిచ్చారు.ఆదివారం స్థానిక సుందరయ్య భవన్, భువనగిరిలో కామ్రేడ్ సంగు రవీందర్ గారి 11వ వర్ధంతి సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ సంగు రవీందర్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించినారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నర్సింహ లు పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ సంగు రవీందర్ చిన్ననాటి నుండే ఎర్ర జెండా నాయకత్వంలో విద్యార్థులు, యువజనలు, రైతులు, వ్యవసాయ కూలీలు, సంఘటిత, అసంఘటిత కార్మికులు, వృత్తిదారులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించే దాంట్లో కీలక పాత్ర పోషించారని అన్నారు. నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనేక ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని అన్నారు. ప్రధానంగా నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికుల హక్కులను కాలరాసిందని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేదలకు వ్యవసాయ కూలీలకు కీలకంగా ఉపయోగపడుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టంను కూడా మార్చి కూలీల పొట్ట కొడుతున్నారని అన్నారు. మరోపక్క రైతులకు, పేదలకు ఉ పయోగపడుతున్న విద్యుత్ సబ్సిడీని ఎత్తివేయడానికి విద్యుత్ సవరణ బిల్లును కూడా తీసుకొచ్చారని, రైతాంగానికి నష్టం చేసే విధంగా విత్తన




చట్టాన్ని తెచ్చారని ఈ చట్టాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పోరాడాలని కోరారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు వాగ్దానాలు అనేకం ఇచ్చి వాటిని అవలు మాత్రం చేయడం లేదని విమ ర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలు ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు, ఇండ్లు నిర్మాణం చేసుకుంటే వాటికి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వవలసిందిపోయి ఆ భూ ములను ఆక్రమించుకొని డబ్బులు దండుకోవడానికి పేదల ఇండ్లను కూ లగోడుతున్నారని పేదల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల పక్షాన ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలని లేకపోతే గత పాలకులకు పట్టిన గతే పడుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోమటిె ఒడ్డి చంద్రారెడ్డి, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్, సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు బందెల ఎల్లయ్య, గ ం ధమల్ల మాతయ్య, కల్లూరి నాగమణి, భువనగిరి మండల పార్టీ కా ర్యదర్శివర్గ సభ్యులు కొండమడుగు నాగమణి, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు బర్ల వెంకటేష్, వల్దాసు అంజయ్య, నాయకులు కొలుపుల వివేకనంద, ఎండి. సలీం, మధ్యబోయిన సుందర్, ఎం.శంకర్ లు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితునికి అండగా ఆర్థిక సహాయం



**మోత్కూరు, మార్చి 01( వార్త వేదిక సూర్య) :** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని భువనగిరి రోడ్డుకు ఉన్న శ్రీ మణికంఠ ఆటో ఎలక్ట్రికల్ వర్క్స్ లో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం సంభవించి సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లగా ఆదివారం స్థానిక వెల్డింగ్ వర్కర్స్ ,ట్రాక్టర్ మెకానిక్, ఆటోమొబైల్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బాధితుడు ఏనుగు లింగారెడ్డికి రూ. 37,116 విలువైన యంత్రాలను కొనుగోలు చేసి అందజేశారు.. ఈ కార్యక్రమంలో వెల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ముప్పా వెంకట్ రెడ్డి, ప్రతినిధులు లింగాల జైపాల్ రెడ్డి, తమ్మినేని శ్రీనివాసరావు, బి వెంకటేశ్వరరావు, ముప్పా తిరుమలరెడ్డి ,ముప్ప మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంగడి బజార్ సిసి రోడ్డును పాత అంగడి వరకు పొడిగించాలి



**మోత్కూరు, మార్చి 01 (వార్తా వేదిక సూర్య ):** మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంగడి బజారులో వేసిన సిసి రోడ్డును పాత అంగడి వరకు పొడిగించాలని ఆ కాలనీ ప్రజలు శివార్ల శ్రీనివాస్ యాదవ్, ఎడ్ల మధు, ఎడ్ల యశ్వంత్, గాదెనబోయిన నాగరాజు, గుండు సోమయ్య, జగదీష్, అవిశెట్టి యాదగిరి, అవిశెట్టి వెంకన్న తదితరులు కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పాత బస్టాండ్ నుండి వేసిన సీసీ రోడ్డు గతంలో వడ్డెర కాలనీ నుండి వేసిన సిసి రోడ్డు కు మాత్రమే లింక్ చేశారని తెలిపారు. ప్రాథమిక పాఠశాల, పశువైద్యశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు ఇదే దారిలో ఉన్నాయన్నారు. ప్రతి సంవత్సరం మున్సిపాలిటీకి పన్నులు చెల్లించే తమకు రోడ్డు వేయక పోవడం అన్యాయమన్నారు.. ఇప్పటికైనా అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించి పాత అంగడి వరకు పూర్తి స్థాయిలో రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రశాంతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ వంగపల్లి



**సిద్దిపేట/వార్త వేదిక సూర్య :**సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహిళా కాంగ్రెస్ నాయకురాలు సామ ప్రశాంతి జన్మదిన సందర్భంగా గజ్వేల్ లోని వారి స్వగృహంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కాచారం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ వ్యవస్థాపకులు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి. ఈ సందర్భంగా డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా నాకు సుపరిచితమైన సామ ప్రశాంత్ శ్రీధర్ కుటుంబ సభ్యులు ఇంకా ఎంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వారి కుటుంబం పై శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి రేణుక ఎల్లమ్మ దేవతల కరుణాకటాక్షాలు ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండల కేంద్రానికి చెందిన ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు లెన్కలపల్లి శ్రీనివాస్ ,ఆలేరు వాస్తవ్యులు బి విశ్వనాథం గుప్తా ,ప్రముఖ సినీ గాయని లత తదితరులు పాల్గొన్నారు.

# నాడు ఎడ్లబండ్లు నేడు ఎటు పాయెనో..!

- వ్యవసాయ కుటుంబాలలో రోల్ మెడల్ గా ఉండే ఊర్లకు జాతరకు అదే ప్రయాణం...
- నాటి ఎడ్లబండ్ల ప్రయాణంపై వార్తా వేదిక సూర్య దినపత్రిక లో ప్రత్యేక కథనం

**మోత్కూరు, మార్చి 01 (వార్తా వేదిక సూర్య);** చలికాలం దాటి ఎండాకాలంలో అడుగుపెడుతున్న సందర్భం మంటే మదిలో పాత జ్ఞాపకాలు ఎన్నో సురులు తిరుగుతుంటాయి. కొందరికీ పల్లెల్లో అన్నా పట్టణాలలో ఉన్నా ఆ తరం ఆలోచనలు బావో ధ్వేగాలు చాలావరకు పల్లె చుట్టూ అల్లుకుపోయి ఉంటాయి. చిన్నతనంలో ఆడిన పాటలు తిరిగిన వీధులు, పంట పొలాలు, స్నేహితులతో తల్లిదండ్రులతో కలిసి గడిపిన క్షణాలు నిద్దుర పోయిన గత స్మృతులను తట్టి లేపుతుంటాయి. అలాంటి అరుదైన, అందమైన జ్ఞాపకాలలో ఎడ్ల బండి యాది కూడా అందులో ఒక్కటి గా చెప్పవచ్చు. సుమారు 50 ఏళ్ల క్రితం పల్లె రైతుల బతుకు బండి ప్రజల ముఖ్యమైన ప్రయాణ సాధన ఉండేది. ప్రస్తుతం ఎక్కడో ఒకచోట తప్పా అప్పటి లెక్క ఎక్కడ కనిపించడం లేదు. నాడు వ్యవసాయానికి ఉపయోగపడే ఎడ్లబండ్ల స్థానాన్ని నేడు ట్రాక్టర్ల తో భర్తీ చేస్తున్నారు. పండుగకో... సెలవులకో పల్లెటూరు వెళ్ళినప్పుడు పెరట్లోనో, స్టోర్ రూములోనో వరిపొలాల వద్ద కొట్టంలోనో ఇప్పటికీ శిధిలావస్థలలో ఉన్న బండి చక్రాలు కనిపిస్తుం టాయి. వీటిని చూసి ఎమోషనల్ అయ్యే వాళ్ళు ఎందరో ఉ ంటారు. పల్లెలలో ఇప్పటికీ రైతుల బండ వద్దనో, పొలాల వద్దనో ఏదో ఎడ్ల బండి తాలుడు ఏదో ఒక మూలన పడి ఒక చిహ్నం కనిపిస్తుంది. అది చూసి చిన్నప్పుడు ఎడ్ల బండి పై ఎక్కి ఎలా ఎంజాయ్ చేసామో నేటితరం ప్రజలు గుర్తించుకుంటున్నారు.

**కట్టెలకోసం అడవికి వెళ్ళి......**

.నాటిరోజుల్లో వ్యవసాయం చేసే ప్రతి ఎడ్ల బండి ఉ ండేది. అప్పట్లో గ్యాస్ సిలిండర్లు, గ్యాస్ స్టవ్ లు వాడేవి కాదు. అడవి నుంచి ఎండిన కట్టెలు ఎడ్ల బండిలో తీసుకువచ్చి వాటిని ఉపయోగించుకునే వాళ్ళు. పల్లెలలో అక్కడి ప్రజలు అమ్మ, నాన్న, తాత,మామ అంటూ ఆప్యాయతగా పలకరించుకుంటూ నేను కట్టేలకు వస్తా అంటే అదే బండిలో అన్నం పిల్లలతో (సద్ది తీసుకొని), వెళ్లి కట్టెలు తీసుక వచ్చేవారు. మట్టి ముంతలలో నీళ్లు తీసు౨ కళ్లేది. అడవిలోకి వెళ్ళాక అమ్మ, నాన్నకు తోడుగా వచ్చిన పిల్లలు తల్లిదండ్రులు కట్టెల ఏరుతుంటే పిల్లలు ఎడ్ల బండిపై ఎగురుతూ... మోదుగాకులలో అన్నం పెట్టుకొని తినేవారు. నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటే ఆహా ఎంత బాగుండునో అని అనిపిస్తుంది. జాతర్ల కూడా ఎడ్ల బండి పైనే...... నాటి రోజుల్లో రవాణా మార్గాలు సరిగ్గా లేక ఎడ్లబండ్లే కీలకంగా ఉండేది. తమ గ్రామ సమీపంలో ,సుదూర దూరంలో ఎక్కడైనా. జాతరకు వెళ్లాలంటే ఎడ్లబండ్లకు రంగు రంగు కాగితాలు అలంకరించి ఎండ తలగకుండా తట్టు సంచులతోనో, బొంతలతోనో దేరాలు కుట్టి ఎడ్ల మెడలో గంటలు కట్టి బయలు దేరేవాళ్లు జాతరల్లో ఇదే బండి ఇల్లు అయ్యేది.... నాడు ఆర్టీసీ బస్సులు, పల్లెల రహదారులు సక్రమంగా లేని అన్ని విధాలుగా ఉపయోగించుకున్న ప్రజలు నేడు ఆ ఎడ్ల బండ్లు ఏటుపాయేనో అంటూ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు.





## సీఎం ఫోటో ఫ్రేమ్ బహుమతి

- పీసరి శ్రీకాంత్ రెడ్డి



**మోటకొండూరు/ వార్త వేధిక సూర్య :**మార్చ్ 1 జిల్లా ఇన్చార్జ్ మోటకొండూరు మండలం నాంచారి పేట గ్రామ పంచాయతీకి ఆదివారం రోజున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఫోటో ఫ్రేమ్ ని 6 వ వార్డు మెంబర్ పైళ్ళ మహేష్ రెడ్డికి నాంచారి పేట నివాసి పీసరి శ్రీకాంత్ రెడ్డి ఫోటో ఫ్రేమ్ ను బహుకరి ంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి టీం ముస్కు వికాస్ రెడ్డి, పీసరి రఘుపాల్ రెడ్డి, పైళ్ళ నిఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూరులో హెలీ రోజే శ్రీ రామలింగేశ్వర కల్యాణ వేడుకలు



**మోత్కూరు, మార్చి 01 ( వార్తా వేదిక సూర్య ) :** విపరీతమైన మోదుగు చెట్లతో...మోదుగూరు గా పేరుగాంచి... కాలక్రమేణా మోత్కూరుగా పేరొందిన గ్రామం ఉందంటే యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు. ఇక్కడ ఓ ప్రత్యేకమైన వేడుకలు జరుగుతాయి. హెలీ వేడుకల రోజే ...స్థానిక శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణ వేడుకలు జరుగడం అనాదిగా ఆచారం. ముందు రోజు కామదహనం తర్వాత తెల్లవారుజామున స్వామి వారి కళ్యాణ వేడుకలు జరగడం కొన్ని దశాబ్దాలు నుంచి ఇక్కడి ఆచారం.తాత ముత్తాతల నుండి ఈ ఆచారం కొనసాగుతున్నట్లు ఇక్కడి ప్రాంత ప్రజల అభిప్రాయం. మోత్కూరులో గౌడ కులస్తులు అనాదిగా రామలింగేశ్వర ఆలయ గర్భ గుడిలో అఖండ దీపం (365 రోజులు నూనె)పెట్టె అవకాశం వచ్చింది. ఈ ఆనవాయితీ నేటికీ కొనసాగుతుంది. నాటి రోజుల్లో మోత్కూరు శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర కి చుట్టు పక్కల గుండాల, ఆత్మకూరు, (ఎం ) అమ్మనబోలు, అడ్డ గూడూరు నార్కెట్ పల్లి, దేవరుప్పుల, జీడికల్, జనగామ, తిరుమలగిరి మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుండేవారు..కాలం మారుతున్న కొద్ది ఆయా గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో అక్కడికక్కడే ప్రజలు స్థానికంగా వేడుకలు జరుపుకుంటున్నారు.శ్రీ రామలింగేశ్వర కల్యాణ వేడుకల్లో ఇప్పటికి సుమారు 2025 జంటలు(సతీసమేతంగా) పాల్గొని కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తుంటారు. కల్యాణం అనంతరం ఒకరి పై ఒకరు రంగులు చల్లుకొని హెలీ వేడుకలు ప్రారంభిస్తారు.పట్టణంలో సైతం స్వామి వారి కళ్యాణ వేడుకల అనంతరం హెలీ వేడుకలను యువతీయువకులు, చిన్నారులు, మహిళలు, వ్యాపారులు ఘనంగా జరుపుకుంటారు నాటి సాంప్రదాయాలను ఇక్కడ అదే ఆనవాయితీగా ఇంకా కొనసాగించడం విశేషం.

## మొగుదాల స్వామి గౌడ్ కు ఘన నివాళులు అర్పించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**చౌటుప్పల్ ,వార్త వేదిక సూర్య మార్చి 1:**చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మోగదాల రమేష్ గౌడ్ తండ్రి చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్మన్ మోగదాల పావని రమేష్ గౌడ్ మామ దశదిన కర్మ వలిగొండ రోడ్ లోని ఎస్ఎం రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి హాజరై ఆయన చిత్రపటాలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మునుగోడు ఎన్నికల ఇన్చార్జ్ పబ్బు రాజు గౌడ్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## స్వర్ణకారులు అన్ని రంగాలలో ఎదగాలి

- బిబిబిస్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొండపర్తి బాలా చారి

**మోత్కూరు, మార్చి 01 (వార్త వేదిక సూర్య):** స్వర్ణకారులు అన్ని రంగాలలో ఎదగాలని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు కొండపర్తి బాలాచారి అన్నారు. ఆదివారం మోత్కూరు మండల స్వర్ణకార సంఘం సమావేశం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవ రణంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతి థిగా పాల్గొని మాట్లాడుతూ స్వర్ణకారులు ఐక్యమత్యంతో రాజకీయ,, విద్యా,,సామాజిక ,ఆర్థిక రంగాలలో ఎదగాలని పిలుపునిచ్చారు. ఎంతో ప్రతిభ కలిగిన స్వర్ణ కారులు సమాజంలో వెనుకబడి పోతున్నారని, ప్రభుత్వం కూడా వారి అభ్యున్నతి కోసం ప్రత్యేకమైన సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో తొలి అమరుడైన కాసోజు శ్రీకాంతాచారి ఈ మండలానికి చెందిన వాడని తెలంగాణ తొలి అసెంబ్లీ సభాపతి మధుసూదనాచారి , తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కె. జయశంకర్ తెలంగాణ తల్లి రూపశిల్పి బి.ఎల్.ఎన్. చారి విశ్వకర్మ జాతికి చెందిన వారేనని ఇలా తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వకర్మలు ఎంతో ముందుండి పోరాటం చేసినప్ప టికీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విశ్వకర్మలకు ఒరిగిందేమీ లేదని బాలచారి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్వర్ణకారులను గుర్తించి ప్రత్యేకంగా విశ్వకర్మల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలను అమలులోకి తేవాలని కోరారు. మోత్కూరు స్వర్ణకార సంఘం మండల వ్యాప్తంగా ఉన్న స్వర్ణకారులందర్నీ ఒకతాటిపైకి తెచ్చి స్థానికంగా సంఘ భవనం కోసం, వీరబ్ర౬ హ్మేంద్రస్వామి ఆలయ అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు.




జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్ మాట్లాడుతూ స్థానికంగా స్వర్ణకారులంతా ఐక్యమత్యంతో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం ఐక్యమాత్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మోత్కూరు మండల స్వర్ణకార సంఘం అధ్యక్షునిగా అక్కినేపల్లి వెంకటాచారి ప్రధాన కార్యదర్శిగా మోత్కూరు జయ ప్రసాద్ రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతన ఎన్నికైన వారితో పాటు జిల్లా సంఘం నాయకులను మండల స్వర్ణకారులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లోజు శివకుమార్, మాజీ ఉపాధ్యక్షుడు బోగోజు నర్సింహ్మా చారి, ఎన్నికల ఇంచార్జి కే శ్రీనివాసచారి, పూర్ణాచారి, స్థానిక విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఎం బ్రహ్మచారి, టి మనోహర చారి, సీనియర్ జర్నలిస్టులు ఎస్ ఎన్ చారి, చేపూరి అనిల్, ఆకవరం శ్రీనివాసచారి , మండల నాయకులు స్వర్ణకారుల సంఘం నాయకులు నర్సింహ్మా చారి , కొల్లోజు నరేందర్, షణ్ముఖ చారి ,మోత్కూరు నవీన్, మోత్కూరు జగన్ ,బోగోజు రవి, సజ్జనం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్ కౌన్సిలర్లకు ఘన సన్మానం

**మోత్కూరు, మార్చి 01 ( వార్తా వేదిక సూర్య) :** ఇటీవల మోత్కూరు మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన గడ్డం స్వప్న, సోమనర్సయ్య, వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్లు పన్నాల శ్రీవిద్య శ్రీనివాస్ రెడ్డి, కారుపోతుల వెంకన్న గౌడ్ లను మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జి.ఎం.ఆర్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మిత్ర యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం మున్సిపల్ పాలకవర్గం యూత్ విభాగం ఎక్కువగా ఎన్నికైనందుకు ప్రజలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ సభ్యులు పురుగుల వెంకన్న, బత్తిని శ్రీశైలం,పయ్యంల శ్రీనివాస్, బొడ్డుపల్లి సతీష్, మోత్కూర్ ప్రదీప్ శర్మ, వాసం ప్రసాద్, కొనతం సత్తయ్య,శాఖపురం అనిల్ , గోడిశాల శ్రీనివాస్, బైరు వెంకన్న, మసురం వెంకన్న, వడకాల యాదగిరి, బొల్లెపల్లి శ్రావణ్, ఇక్కిరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు, లైట్ మోటార్స్ వెహికిల్స్ ఓనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...... మున్సిపల్ కేంద్రంలో లైట్ వెయిట్ మోటార్స్ వెహికిల్స్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోత్కూరు మున్సిపల్ నూతన చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య దంపతులను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షులు గోపాల్ దాస్ బిక్షం, ఉపాధ్యక్షులు గొడిశాల శ్రీను, బుంగపట్ల యాకయ్య, నాయకులు షబ్బీర్ అలీ, కడమంచి రమేష్, బొల్లెపల్లి శ్రావణ్, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా విద్యా కమీషన్ నివేదిక

- బి యుటిఎఫ్ మండల అధ్యక్షులు వెంకన్న



**మోత్కూరు, మార్చి 01 (వార్త వేదిక సూర్య) :** ఉ పాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా తెలంగాణ విద్యా కమీషన్ ( ఆకునూరి మురళి కమిటీ) నివేదిక ఉ ందని యుటిఎఫ్ మండల అధ్యక్షులు దర్శనం వెంకన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విద్యా కమీషన్ సంబంధించి 2026 నివేదిక ప్రభుత్వ విద్యా వ్యవస్థ పునాదులను దెబ్బతీసే విధంగా ఉందన్నారు. ఈ నివేదికలో ఉపాధ్యాయులు వేతనాలు తీసుకుంటున్నారని అత్యంత్య ఆక్షేపణీయమైనదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల జీత భత్యాలు అనే అంశం విద్య కమీషన్ పరిధిలోని అంశాన్ని ప్రస్తావించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యావ్యవస్థ పై సమగ్ర విచారణ చేసి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలపై సూచనలు సిఫార్సులు ప్రస్తావించడం అంతంత్య బాధాకరమన్నారు. ఉపాధ్యాయులపై ప్రస్తుత నివేదికను ఇచ్చిన ఆకునూరి మురళి నివేదికను వెంటనే ఉపసంహరించుకోవాలని వెంకన్న డిమాండ్ చేశారు.

